సహజీవన భావనల పావురాయి

# గేయురాయి

వారపత్రిక 8-8-2025 ₹15/-



## జవాబు లేని ప్రశ్నలు



## గాజా ఘోరం - మౌనంగా చూస్తున్న ప్రపంచం



## కురిసే వర్షం సాక్షిగా!

పరిశీలన భావాల సొబగులు
గీటురాయి
వారపత్రిక
GEETURAI WEEKLY
Sandesha Bhavanam, Lakkadkot,
Chatta Bazar, Hyderabad-500 002.
Ph: 040-24564583; 24576237
Email : geeturaiweekly@gmail.com
Website: www.tiptrust.in; geeturai.in
Our Bank A/c Details:
Geeturai Weekly, A/c No.1042789768
IFSC : CBIN0282407, Central Bank of India
Noor Khan Bazar Branch, Hyderabad

సంపుటి: 47 సంచిక: 31 హైదరాబాద్
శుక్రవారం 8 ఆగస్టు 2025 రూ.15-00
13 సఫర్ 1447 హిజ్రీ

**తొలిగీటు**

## మనిషి చేసే కర్మలు ఫలప్రదం కావటం అన్నది అతని సంకల్పంపై ఆధారపడి ఉంటుంది.

– మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం)

**సంపాదకులు**
**ఎస్.ఎమ్. మలిక్**


**అసోసియేట్ ఎడిటర్**
**అబ్దుల్ వాహెద్**

**ఎడిటోరియల్ ఇన్‌ఛార్జి**
**ముహమ్మద్ ముజాహిద్**

గ్రాఫిక్స్
**ఎల్. లక్ష్మీనారాయణ**
**ముహమ్మద్ రఫీఖ్**

సర్క్యులేషన్ మేనేజర్
**అబ్దుల్ జలీల్, 9704317015**

Edited, Printed & Published by S.M. Mallick on behalf of Telugu Islamic Publications, Typeset at “Geeturai Graphics”, Printed at Cosmic Printers, Lakkadkot, Hyderabad-2, RNI R.No.37796/81, Postal Regn. No.HSE/422/2023-2025 Phone: 24564583. e-mail: geeturaiweekly@gmail.com




14

## లోపల... సమకాలీన ప్రపంచానికి సరైన దిక్సూచి

| | | |
|---|---|---|
| పాలస్తీనా వెంట ఫ్రాన్స్ | ...... | 04 |
| జవాబులేని ప్రశ్నలు | ...... | 05 |
| మహనీయ అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ (రజి) – 4 | ...... | 08 |
| చరితార్థులు–2 : షేఖ్ అలీ సాహెబ్ | ...... | 11 |
| హరిహర వీరమల్లు, చరిత్ర వక్రీకరణకు పరాకాష్ఠ | ...... | 12 |
| చెట్ల పెంపకం పర్యావరణ సంక్షోభానికి పరిష్కారం | ...... | 16 |
| చిన్నారులను పర్యావరణ ప్రేమికులుగా మలచుటకు.... | ...... | 17 |
| వెలుగుబాట (తఫ్హీముల్ ఖుర్‌ఆన్ అనువాదం) | ...... | 18 |
| అడుగుజాడలు (సహీహ్ బుఖారీ అనువాదం) | ...... | 19 |
| దౌర్జన్యపరుడు వట్టి మూర్ఖుడు | ...... | 20 |
| ఆస్తులు ఆత్మీయతలు | ...... | 22 |
| గాజా ఘోరం–మౌనంగా చూస్తున్న ప్రపంచం | ...... | 24 |
| కురిసే వర్షం సాక్షిగా! | ...... | 26 |
| పరామర్శ పరమార్థం–2 | ...... | 28 |
| సభ్య సమాజానికి తలవంపు.... | ...... | 30 |
| సంక్షిప్త భారతం | ...... | 32 |
| సర్వత్రా | ...... | 33 |
| పశ్చాత్తాపం చెందిన యువకుడు | ...... | 34 |

**అబద్ధాల తాత...**



పార్లమెంటు వేదికగా
మోడితాత రాహులు
గట్టిగ పోట్లాడాలంటే
తినండోయ్ రాగులు!
అడిగిందానికి సూటిగ
చెప్పకుండనే జవాబు
పిట్టకథలు వినిపిస్తూ
చేస్తుండోయ్ రువాబు!!

**– యం.డి. ఉస్మాన్ ఖాన్**

## ఆలోచన

# పాలస్తీనా వెంట ఫ్రాన్స్

జి7 దేశాల్లో పాలస్తీనాకు గుర్తింపు ఇచ్చే మొదటిదేశంగా ఫ్రాన్స్ ముందుకు వచ్చింది. జి 7 దేశాలు ఇంతవరకు పాలస్తీనాను ప్రత్యేక దేశంగా గుర్తించలేదన్నది మనందరికీ తెలుసు. భారత దేశం పాలస్తీనాను ఎప్పుడో గుర్తించింది. ఫ్రాన్స్ చేసిన ప్రకటనతో జి7 దేశాల్లోని విభేదాలు బయటపడ్డాయి. జి7 దేశాలన్నీ అమెరికాకు ఇంతవరకు వంతపాడుతూ వచ్చాయి. ఇప్పుడు ఫ్రాన్స్ తన దారి తాను చూసుకుంటానంటోంది.

ట్రంప్ ఇటీవల పశ్చిమాసియా దేశాలు పర్యటించి అనేక వ్యాపార ఒప్పందాలు చేసుకున్న విషయం మనకు తెలుసు. ఇప్పుడు పాలస్తీనాకు గుర్తింపు ఇవ్వడం ద్వారా ఫ్రాన్స్ పశ్చిమాసియాలో తన పలుకుబడి పెంచుకునే ప్రయత్నాల్లో ఉంది.

జి7 దేశాల్లో జర్మనీ, బ్రిటన్, ఫ్రాన్స్, కెనడా, అమెరికా, ఇటలీ, జపాన్ ఉన్నాయి. రష్యాను కలుపుకుంటే వీటిని జి8 అంటారు. ఉక్రెయిన్‌పై రష్యా దాడి చేసిన తర్వాత ఇది జి8 అయ్యింది. ఇప్పుడు ఫ్రాన్స్ పక్కకు తప్పుకుంటే జి6 మిగులుతాయి.

గాజా, వెస్ట్ బ్యాంక్‌ను కలిపి పాలస్తీనా అంటారు. వెస్ట్ బ్యాంక్‌లో ఫతా పార్టీ ప్రభుత్వం ఉంది. గాజాలో హమాస్ పరిపాలన ఉంది. హమాస్‌ను రాజకీయపార్టీగా చాలా దేశాలు గుర్తిస్తాయి. హమాస్‌కు స్వంత సైన్యం ఉంది. హమాస్‌ను ఇస్రాయిల్ ఉగ్రవాదులని చెబుతుంది. వెస్ట్ బ్యాంక్‌లో ఫతా అధికారంలో ఉంది. పాలస్తీనాతో అంతర్జాతీయ చర్చల్లో ఫతా గ్రూపుతోనే సాధారణంగా చర్చలు జరుగుతాయి. ఫతాకు, హమాస్‌కు మధ్య విభేదాలు కూడా ఉన్నాయి.

ఇప్పుడు ఫ్రాన్స్ ఎవరికి గుర్తింపు ఇస్తుందన్న ప్రశ్న వస్తుంది. హమాస్ కు గుర్తింపు ఇస్తుందా? అనే ప్రశ్న వస్తుంది. లేదు, ఫ్రాన్స్ హమాస్‌కు గుర్తింపు ఇవ్వడంలేదు. ఫతా గ్రూపు పాలస్తీనాకు ప్రాతినిథ్యం వహిస్తుంది కాబట్టి ఫతా గ్రూపుకే గుర్తింపు ఇస్తుంది.

1917లో పాలస్తీనా స్వతంత్ర దేశం, ఉస్మానియా సామ్రాజ్యంలో భాగంగా ఉండేది. ప్రథమ ప్రపంచయుద్ధంలో ఉస్మానియా ఓడిపోయింది. పాలస్తీనా బ్రిటిషువారి ఆక్రమణలోకి వచ్చింది. బ్రిటిషు వారు ఈ ప్రాంతాన్ని యూదులకు ఇచ్చారు. పాలస్తీనాలో యూదుల కాలనీలు ఏర్పడ్డాయి. నెమ్మదిగా మొత్తం పాలస్తీనాను ఆక్రమించారు. కేవలం గాజా, వెస్ట్ బ్యాంకులు మాత్రమే ఇప్పుడు పాలస్తీనా పేరుతో మిగిలాయి.

ఈ విధంగా ఏర్పడింది యూదుల దేశం ఇస్రాయిల్. పాలస్తీనా, ఇస్రాయిల్ సమస్య అప్పటి నుంచి కొనసాగుతూ ఉంది. ఈ సమస్యకు రెండు దేశాల పరిష్కారం ముందుకు వచ్చింది. ప్రపంచంలో చాలా దేశాలు దీన్ని సమర్థిస్తున్నాయి. ఇస్రాయిల్ కూడా ప్రారంభంలో దీనికి ఒప్పుకుంది, తర్వాత కాదంటుంది.

ఏది ఏమైనా వెస్ట్ బ్యాంకులో ఉన్న పాలస్తీనా అథారిటీ ప్రభుత్వం లేదా ఫతా గ్రూపు ప్రభుత్వాన్ని ప్రపంచంలో చాలా దేశాలు ఒప్పుకుంటున్నాయి. కాని ఇప్పటి వరకు జి7 దేశాలు ఈ పాలస్తీనా అథారిటీని కూడా గుర్తించలేదు. ఇప్పుడు ఫ్రాన్సు ఆ పని చేస్తానంటోంది.

ఫ్రాన్సు చెబుతున్నదేమిటంటే, పాలస్తీనాకు గుర్తింపు ఇవ్వడం, రెండు దేశాల పరిష్కారాన్ని గుర్తించడం, హమాస్ నిరాయుధీ కరణ, గాజా పునర్నిర్మాణం. వీటన్నింటిలోను హమాస్ నిరాయుధీకరణ అనేది అంత సులభమైనది కాదు.

ఫ్రాన్సులో యూదులు, ముస్లిములు పెద్ద సంఖ్యలో ఉన్నారు. ఇక్కడ ఓటుబ్యాంకు రాజకీయాలు కూడా పనిచేస్తాయి. ఫ్రాన్సులో మరిన్ లపెన్ అనే రాజకీయ నేత క్రయిస్తవ, యూదు అనుకూల రాజకీయాలతో మాక్రాన్‌ను దెబ్బతీయ డానికి ప్రయత్నిస్తూ వచ్చారు. ఈ ప్రయత్నాలను అడ్డుకోడానికే మాక్రాన్ బురఖా బ్యాన్ వంటివి తీసుకు వచ్చారు. కాని ఇప్పుడు ఈ రియాక్టివ్ రాజకీయాలు వదిలేసి పాలస్తీనాకు గుర్తింపు ఇస్తామంటూ కొత్త రాజకీయాలతో ముందుకు వచ్చారు. ఈ ప్రకటన తర్వాత సహజంగానే నెతన్యాహు భగ్గుమన్నాడు. అన్నింటికి మించి ఫ్రాన్స్ ప్రకటన తర్వాత అమెరికా తన ప్రతిష్ఠ నిలబెట్టుకునే ప్రశ్న వచ్చింది. పశ్చిమాసియా దేశాలు ఫ్రాన్స్ ప్రకటనను స్వాగతించాయి.

ఏది ఏమైనా ఫ్రాన్స్ ప్రకటన తర్వాత పశ్చిమాసియాలో సమీకరణాలు మారుతున్నాయి. ఇప్పటికే ఈరాన్ ఇస్రాయిల్ యుద్ధం తర్వాత మారిన సమీకరణాలు ఇప్పుడు మరిన్ని కుదుపులకు గురవుతున్నాయి. ✤

అబ్దుల్ వాహెద్



# జవాబు లేని ప్రశ్నలు

నరేంద్ర మోడీ ప్రభుత్వం లోక్‌సభలో 16 గంటల చర్చ ముగిసిన తర్వాత పహల్గామ్ ఉగ్రదాడి, ఆపరేషన్ సింధూర్‌లపై ప్రతిపక్షాలు లేవనెత్తిన ప్రశ్నలకు చెప్పిన జవాబుల్లో మరిన్ని ప్రశ్నలే మిగిలాయి తప్ప జవాబులు దొరకలేదు.

నేషనల్ డెమోక్రటిక్ అలయన్స్ శిబిరంలోని నేతలందరూ గత చరిత్రను తవ్వి తీశారు. కాంగ్రెసుదే పాపమని యథాప్రకారం విమర్శించేసి సరిపుచ్చుకున్నారు. కాని మోడీ ప్రభుత్వం సాధించిందేమిటి? అనే ప్రశ్నకు మాత్రం జవాబు దొరకలేదు.

ప్రతిపక్షాలను పాకిస్తాన్ మద్దతుదారులుగా చిత్రీకరించే ప్రయత్నాలు భారత ప్రజాస్వామ్యానికి శోభిస్తాయా? ప్రతిపక్షాలను ముస్లిం సమర్థకులుగా అపహాస్యం చేస్తూ ఈ నేతలు లోక్‌సభలో మాట్లాడిన తీరు ఎన్నికల సభల్లో ఈ నేతలు మాట్లాడే తీరుకు భిన్నంగా లేదు.

ఆపరేషన్ సింధూర్ జరుగుతున్నప్పుడు అమెరికా అధ్యక్షుడు

డోనాల్డ్ ట్రంప్ అకస్మాత్తుగా తాను యుద్ధ విరమణ చేయించానని ప్రకటించేశాడు. యుద్ధ విరమణ కూడా జరిగిపోయింది. అప్పటి వరకు ఇక్కడ గోదీ మీడియాగా పేరుపడిన ప్రభుత్వ అనుకూల మీడియాలో పాకిస్తాన్ చిత్తు చిత్తుగా ఓడిపోతున్న వార్తలు వింటున్న వారికి అసలు యుద్ధ విరమణ ఎందుకు జరిగిందో అర్థం కాలేదు. చాలా మంది ప్రభుత్వ వైఖరిపై నిరాశకు గురయ్యారు. అలాంటి వారందరినీ బుజ్జగించడానికి ఉద్దేశించిన ప్రసంగాల్లా ఇవి కనిపించాయి. ఆపరేషన్ సింధూర్ విజయవంత మైందని చెప్పే ప్రయత్నాల్లో భాగంగా హోం మంత్రి అమిత్ షా ఒక సంచలన ప్రకటనతో చర్చకు తెరలేపారు. జూలై 28, 2025న పహల్గామ్ ఉగ్రదాడిలో పాల్గొన్న ముగ్గురిని సైన్యం హతమార్చిందన్నారు. కాని ఈ మొత్తం చర్చలో అనేక ప్రశ్నలకు జవాబులు దొరకలేదు.

పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని ఉగ్రవాద ప్రధాన కార్యాలయాలపై లక్షిత దాడి అని, ఇది సైనిక యుద్ధాన్ని పెంచేది కాదని నరేంద్ర మోదీ, అమిత్ షా, ఎస్. జైశంకర్, రాజ్‌నాథ్ సింగ్ అందరూ చెప్పారు.

మే 6, 2025న పాకిస్తాన్ భూభాగంలోకి లోతుగా చొచ్చుకు పోయి ఉగ్రవాద స్థావరాలపై అపూర్వమైన వైమానిక దాడి చేసి అనుకున్న లక్ష్యం పూర్తి చేసిన తర్వాత కేంద్ర ప్రభుత్వం దాడులను ముగించాలని నిర్ణయించినట్లు చెప్పారు. మే 9-10 తేదీల మధ్య రాత్రి పాకిస్తాన్ చేసిన రెచ్చగొట్టే దాడుల కారణంగానే భారతదేశం తన సైనిక కార్యకలాపాలను తిరిగి ప్రారంభించిందని, ఆ దాడుల్లో భారత భద్రతా బలగాలు పాకిస్తాన్‌లోని అనేక సైనిక స్థావరాలను దెబ్బతీశాయని అన్నారు. పాకిస్తాన్‌లోని కొన్ని సైనిక స్థావరాలు, "ఇప్పటికీ ఐసీయూలో కోలుకుంటున్నాయి" అని ప్రధానమంత్రి అన్నారు.

కాని ప్రధాన స్రవంతి మీడియాగా చెప్పుకునే మీడియాలో అప్పట్లో వచ్చిన వార్తలు వేరుగా ఉన్నాయి. భారత భద్రతా దళాలు పాకిస్తాన్లోని ముఖ్యమైన నగరాలు, వ్యూహాత్మక భూభాగాలను ఆక్రమించేసుకున్నాయనే స్థాయిలో అప్పట్లో ప్రచారం చేశారు. ఇప్పుడు మోదీ ప్రభుత్వం ఏం చెబుతుందంటే, పాకిస్తాన్‌పై జరిగిన నియంత్రిత దాడులు సాధించిన అద్భుతమైన విజయంతో సంతృప్తి చెందాలని అంటుంది. ఇంకో విషయం అమిత్ షా చెప్పిన ఆపరేషన్ మహాదేవ్ - పహల్గాం దాడిలో పాల్గొన్న ముగ్గురు ఉగ్రవాదులను హతమార్చాం అనే ప్రకటన. కాని పహల్గాం దాడికి సంబంధించిన కొన్ని ప్రశ్నలు ఎలాంటివి అలాగే ఉన్నాయి. దాడి ఎలా జరిగింది? నిఘా వైఫల్యానికి కారణమేమిటి? అక్కడ భద్రతాదళాలు ఎందుకు లేవు? ఈ ప్రశ్నలకు జవాబులు దొరకలేదు.

ముఖ్యమైన విషయం ట్రంప్ యుద్ధ విరమణ నేనే చేయించానని పదే పదే చెప్పడం. ఆపరేషన్ సింధూర్ వల్ల పాకిస్తాన్ బెంబేలెత్తి యుద్ధ విరమణకు ప్రాధేయపడిందని చెబుతున్నారు. కాని పాకిస్తాన్ ప్రాధేయపడితే కనికరించవలసిన అవసరం భారతదేశానికి ఏముంది? ఈ ప్రశ్నకు జవాబు దొరకలేదు. అలాగే ప్రపంచంలోని ఏ దేశమూ మధ్యవర్తిత్వం వహించలేదని గోడమీది పిల్లివాటం మాటలు చెప్పారే కాని ట్రంప్ అబద్ధాలు చెబుతున్నాడని, యుద్ధవిరమణ ట్రంప్ చేయించలేదని ముక్కుసూటిగా చెప్పలేదు.

మరో ముఖ్యమైన విషయం, యుద్ధ విమానాలు కూలిపోయాయన్న వార్తలపై స్పష్టత రాలేదు. ప్రతిపక్షాన్ని ఎగతాళి చేసి, ప్రతిపక్ష నాయకులను పాకిస్తాన్ మద్దతుదారులుగా ముద్ర వేయడం ఈ ప్రశ్నకు జవాబు కాదు.

పాకిస్తాన్ ఉగ్రవాదాన్ని ప్రోత్సహించే దేశంగా ప్రపంచస్థాయిలో నిలబెట్టామని మోడీ ప్రభుత్వం చెప్పుకున్నప్పటికీ, ఆపరేషన్ సింధూర్ జరిగిన వెంటనే అంతర్జాతీయ ద్రవ్య నిధి, ఆసియా అభివృద్ధి బ్యాంక్ నుండి బిలియన్ల కొద్దీ రుణాలు పాకిస్తాన్ సంపాదించినప్పటికీ మనం ఎందుకు అడ్డుకోలేకపోయాం? పహల్గామ్ దాడి తర్వాత పాకిస్తాన్‌ను ప్రపంచ దేశాల్లో ఏఏ దేశాలు ఖండించాయో చెప్పలేదు. చరిత్రలో కాంగ్రెస్ ప్రభుత్వాల దౌత్యపరమైన వైఫల్యాల జాబితాను చెప్పడమే సమాధానంగా ప్రభుత్వం వ్యవహరించింది. ప్రతిపక్ష నాయకులు ఒక నిర్దిష్ట ప్రశ్న అడిగారు. ఉగ్రవాదులు బైసారన్ లోయలోకి సులభంగా ఎలా ప్రవేశించారు? ఉగ్రదాడి తర్వాత అక్కడి నుండి ఎలా తప్పించుకోగలిగారు? ప్రతిపక్షాలు అడుగుతున్న ఈ ప్రశ్నకు జవాబు రాలేదు, వాక్చాతుర్యంతో మసిపూసి మారేడుకాయ చేసే ప్రయత్నాలు కనిపించాయి. క్లుప్తంగా చెప్పాలంటే గతంలో కాంగ్రెసు ప్రభుత్వాల పాపం వల్లనే ఇదంతా జరిగిందని నమ్మించడమే ముఖ్యంగా కనిపించింది.

పహల్గాం ఉగ్రదాడి తర్వాత వందరోజులకు చట్టసభలో జరిగిన డిబేట్‌లో అనేక ప్రశ్నలకు జవాబులు దొరుకుతాయనుకున్న వారికి నిరాశే మిగిలింది.

పహల్గాం దాడిలో పాల్గొన్న ముగ్గురు ఉగ్రవాదులను హత మార్చాం అని హోంమంత్రి చేసిన ప్రకటన మాత్రమే సమాధానమని అనుకోవాలి.

కాని

మనం గెలుస్తున్న యుద్ధంలో అకస్మాత్తుగా యుద్ధవిరమణ ఎందుకు చేశాం?

అమెరికా అధ్యక్షుడు ఎందుకు పదేపదే అబద్ధాలు చెబుతున్నాడు?

యుద్ధంలో నష్టాలనేవి తప్పవు, పాకిస్తాన్ కు జరిగిన నష్టమెంత? మనకు జరిగిన నష్టమెంత?

అన్నింటికీ మించి ఇంత జరిగిన తర్వాత, ఆపరేషన్ సింధూర్ ఇంకా ముగియలేదని చెబుతున్న నేపథ్యంలో మనం పాకిస్తాన్‌తో క్రికెట్ ఎందుకు ఆడుతున్నాం?

అతి ముఖ్యమైన విషయం, పహల్గాం ఉగ్రదాడికి నైతిక బాధ్యత ఎవరిది?

లోక్‌సభలో చర్చను గమనిస్తే రెండు విషయాలు కనిపించాయి–

ప్రతిపక్షాలు ప్రశ్నలే ప్రశ్నలు అడిగాయి.

ప్రభుత్వం వ్యక్తిగత స్థాయిలో ప్రతిపక్ష నేతలపై దాడి చేసింది.

పాకిస్తాన్ చేతుల్లో కాంగ్రెస్ రిమోట్ కంట్రోల్ ఉంది, కాంగ్రెస్ ఉగ్రవాదుల భాష మాట్లాడుతోంది వంటి మాటలు తప్ప వివరాలు, ఆధారసహిత వాదనలు వంటివి మోదీ ప్రసంగంతో సహా ఎవరి ప్రసంగంలోనూ వినిపించలేదు.

రాజ్‌నాథ్ సింగ్ తన ప్రసంగంలో ప్రతిపక్షాలను విమర్శిస్తూ మన యుద్ధ విమానాలు ఎన్ని కూలిపోయాయని అడగడాన్ని తప్పుపట్టారు, ప్రతిపక్షాలు శత్రు విమానాలు మనం ఎన్ని కూల్చామో అడగవలసిందని చెబుతూ, ప్రతిపక్షాలు అడగవల సిన ప్రశ్నలేమిటో కూడా ఆయన నిర్ణయించి చెప్పారు. ప్రతి పక్షాలు రక్షణ మంత్రి ఇచ్చిన ప్రశ్నల జాబితా నుంచి మాత్రమే ప్రశ్నలు అడగాలన్నది ఆయన ఉద్దేశ్యమా?

ఆపరేషన్ సింధూర్ సాధించిందేమిటి? అనే ప్రశ్నకు స్పష్టమైన జవాబు ఈ చర్చలో దొరికిందా?

ఆలోచించవలసిన మరో ముఖ్యమైన విషయమేమిటంటే, పాకిస్తాన్‌కు చైనా పూర్తి మద్దతు ఇచ్చిందన్నది ఇప్పుడు స్పష్టంగా అందరికీ కనిపిస్తున్న వాస్తవం. ఈ విషయాన్ని చాలా మంది చాలా స్పష్టంగా చెప్పారు. కాని చర్చలో చైనా ఊసు కూడా ప్రభుత్వ పక్షం నుంచి ఎవరూ ఎత్తలేదు.

కీలకమైన ప్రశ్న గెలుస్తున్న యుద్ధంలో అకస్మాత్తుగా ఎందుకు యుద్ధ విరమణ చేశారన్నది. మోడీ అధికారంలోకి వస్తే పాకిస్తాన్ ఆక్రమిత కశ్మీర్ ను సాధించేస్తామని గతంలో చెప్పారు కదా! అలాంటి అవకాశం మనకు దక్కినప్పుడు ఎందుకు వదిలేశారు?

రాజ్‌నాథ్ సింగ్ ప్రకారం సరిహద్దులు దాటి, పాకిస్తాన్ భూభాగంపై ఆక్రమణ చేయడం ఈ ఆపరేషన్ ఉద్దేశ్యం కాదు. ప్రతిపక్షాలు అడిగిన ప్రశ్న ఏమిటి? యుద్ధంలో పైచేయి అయి నప్పుడు పూర్తి విజయం సాధించకుండా, పాకిస్తాన్ ఆక్రమిత కశ్మీర్‌ను చేజిక్కించుకోకుండా ఎందుకు వదిలేశారన్నది?

పాకిస్తాన్ ప్రాధేయపడిందని రాజ్‌నాథ్ సింగ్ చెప్పారు. అందుకే యుద్ధం ఆపేశామన్నారు? పాకిస్తాన్ ప్రాధేయపడితే మీరెందుకు ఒప్పుకోవాలి అనే రాహుల్ గాంధీ ప్రశ్నకు జవాబు లేదు.

ఇప్పటికి పాతికసార్ల కన్నా ఎక్కువ ట్రంప్ తానే యుద్ధం ఆపేశానని చెప్పారు. ట్రంప్ మాటలు అబద్ధమని గట్టిగా ఎవ్వరూ చెప్పలేదు. ఈ మొత్తం వ్యవహారంలో అసలు అమెరికా ఎలా తలదూర్చింది? అన్నది చాలా ముఖ్యమైన ప్రశ్న.

మన విదేశీ మంత్రి చెప్పిన మాటలు నమ్మరా? అని అమిత్ షా అడిగిన ప్రశ్న బాగానే ఉంది. సరే, దేశంలో మనమంతా మన విదేశీ మంత్రి చెప్పిన మాటలను నమ్ముతున్నాం. కాని లోక్‌సభలో ఒకవైపు ఈ డిబేట్ జరుగుతున్న సమయంలోనే అంతర్జాతీయ మీడియా ముందు ట్రంప్ ఈ యుద్ధాన్ని తానే ఆపానని చెప్పాడు.

ఈ చర్చలో అసదుద్దీన్ ఒవైసీ ఒక కీలకమైన ప్రశ్న అడిగారు. పాకిస్తాన్‌తో క్రికెట్ ఎందుకు ఆడుతున్నారని సూటిగా అడిగారు.

పాకిస్తాన్ ఆక్రమిత కశ్మీర్‌కు కారణం జవహర్ లాల్ నెహ్రూ అంటూ అమిత్ షా యధాప్రకారం కాంగ్రెసుదే పాపమంతా అనేశారు. కాని గెలుస్తున్న యుద్ధంలో పాక్ ఆక్రమిత కశ్మీర్‌ను తీసుకోకుండా యుద్ధవిరమణ ఎందుకు చేశారు సార్ అనే ప్రశ్నకు జవాబు లేదు. పహల్గాం ఉగ్రదాడికి నైతిక బాధ్యత ఎవరిదన్న ప్రశ్నకు కూడా జవాబు లేదు. క్లుప్తంగా చెప్పాలంటే ఈ చర్చ తర్వాత జవాబులు తక్కువ దొరికాయి, ప్రశ్నలు మరిన్ని మన ముందుకు వస్తున్నాయి. ✤

# కలసి వచ్చిన కూడలి

7/4

**ఎస్.ఎమ్. మలిక్**

# మహనీయ అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ (రజి)

## మహనీయ ఉమర్(ర) అంతిమ కోరిక

మదీనాలో మహనీయ ముగైరా బిన్ షుబా (ర)కు చెందిన బానిస ఫీరోజ్ (అబూ లూలూ) ఫజ్ర్ నమాజ్‌లో మహనీయ ఉమర్ (ర)ను బాకుతో పొడిచినప్పుడు ఆయన వెంటనే అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ చెయ్యి పట్టుకుని తన స్థానంలో నిలబెట్టారు, మరి స్వయంగా తాను విరివిగా రక్తం కారడం చేత సొమ్మసిల్లి పడిపోయారు. దగ్గరి పంక్తిలో ఉన్న నమాజ్ చేసేవారు ఇదంతా చూశారు, దూరాన ఉన్న వారికి ఇదంతా ఏమీ తెలియదు. వారు మహనీయ ఉమర్ కంఠం వినరాక పోవడంతో, సుబ్‌హానల్లాహ్, సుబ్‌హానల్లాహ్ అని కేకలు వేయసాగారు. ఆ పైన మహనీయ అబ్దుర్రహ్మాన్ నమాజ్ క్లుప్తంగా చేయించారు.

మహనీయ ఉమర్ ఫారూక్ (ర) గాయపడిన దాదాపు పది గంటల తరువాత సోమవారం సాయంత్రం అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్‌తో మాటలాడారు. "నీవు చెప్పినట్లే నేను ఖిలాఫత్ భారాన్ని మోయగల వారినే సముదాయ నాయకునిగా చేయ దలిచాను. అలా చేస్తే మరణానంతరం కూడా అతని బాధ్యత నా పైనే ఉంటుంది. అందువల్ల నాకు ధైర్యం అవడం లేదు. ఇదో ఈ ఆరుగురు, అలీ, ఉస్మాన్, అబ్దుర్రహ్మాన్, సఅద్, జుబైర్, తల్హా. వీరిని గురించి ప్రవక్త మహనీయులు (స) వీరు స్వర్గవాసులని శుభవార్త ఇచ్చారు. వీరిలో ఒకరిని ఖలీఫాగా ఎన్నుకోండి.

"ఈ ఆరుగురు కాక నా పుత్రుడు అబ్దుల్లాని కూడా పిలుచు కోండి, కాని అతనికి నాయకత్వంతో సంబంధం లేదు. ముగ్గురి అభిప్రాయం ఒక వైపున, మిగతా ముగ్గురి అభి ప్రాయం మరో వైపునకు చీలినప్పుడు అబ్దుల్లా అభిప్రా యాన్ని లెక్కింపులో తీసుకోవచ్చు. ఎవరికయినా అబ్దుల్లా అభిప్రాయం స్వీకార యోగ్యం కాకపోతే అబ్దుర్రహ్మాన్ అభిప్రాయం ఎవరి పక్షంలో ఉంటే వారినే ఖలీఫాగా నియమించండి."

## ఆయన చిత్త శుద్ధి

మహనీయ ఉమర్ (ర) ఇచ్చిన ఈ నిర్దేశన దృష్ట్యా అబ్దుర్రహ్మాన్ పట్ల మహనీయ ఉమర్ అభిప్రాయం ఏమిటో స్పష్టమవుతుంది. మహనీయ ఉమర్ ఫారూక్ నిర్దేశన మేరకు ఆచరణ జరపగా సాగిన కార్యకలాపాల వివరాలు లోగడ మహనీయ ఉస్మాన్ (ర) కార్యకలాపాలను వ్రాసిన సంద ర్భంలో వివరంగా పేర్కొన్నాము. మహనీయ అబ్దుర్రహ్మాన్ స్వయంగా తానే ఖిలాఫత్ బరి నుంచి తప్పుకున్నారు. వారి ఈ వైఖరి ఆయన నైజాన్ని చాటి చెబుతోంది.

ఖలీఫా ఎన్నిక సమయాన మహనీయ తల్హా బిన్ ఉబై దుల్లాహ్ (ర) మదీనాలో లేరు. కాబట్టి మిగిలిన నలుగురు సభ్యులు ఖలీఫా ఎన్నిక బాధ్యత మహనీయ అబ్దుర్రహ్మాన్ మీద వేశారు. అప్పుడు ఆయన వారిని ఉద్దేశించి ఇలా అన్నారు :

“మీరు ఈ కార్య భారం నాకు అప్పచెబుతున్నారా? అయితే దైవం సాక్షిగా, నేను మీలో (నిష్పక్షపాతంగా) అధికంగా యోగ్యుడయిన వ్యక్తిని (ఎన్నుకోవడంలో) సాధ్యమయినంత మేరకు ఎటువంటి జాప్యం జరగనివ్వను.”

## బాధ్యతా భావం

ఆ విధంగా మాట ఇచ్చిన తరువాత ఆయన(ర) మూడు దివారాత్రులు సహచర మాన్యులు, సముదాయ నాయ కులు, తెగల నాయకులు, సేనా నాయకులతో చర్చించి, వారి అభిప్రాయాలను సేకరించారు. అధిక సంఖ్యలో జనులు మహనీయ ఉస్మాన్ (ర)ని బలపరిచారు. కడకు మహనీయ ఉమర్(ర) వీలు ప్రకారం మూడు రోజులు ముగిసే సమయానికి మహనీయ అబ్దుర్రహ్మాన్(ర) ప్రకటన చేయించారు. ప్రవక్త మస్జిద్ తెల్లవారు సమయాన జనులతో కిటకిట లాడింది. అప్పుడు ఆయన మహనీయ అలీని పిలిచి ఆయన చెయ్యి పట్టుకుని అన్నారు,

మీకు దైవ సందేశహరుల(స)తో ఉన్న ప్రగాఢ సంబంధం, ఇస్లామ్‌తో గల దీర్ఘకాలిక అనుబంధం మీ స్వంత వ్యవ హారం, అందరికన్నా అధికంగా మీకే తెలుసు. ఒకవేళ నేను మిమ్మల్ని ఖలీఫాగా నియమిస్తే దైవానికి సాక్షిగా పెట్టి చెప్పండి, న్యాయం పాటిస్తారా? లేదా మహనీయ ఉస్మాన్‌ని ఖలీఫాగా నియమిస్తే ఆయనకు విధేయులయి మెలుగుతారా?

ఆ తరువాత ఈ వాక్యాలే మహనీయ ఉస్మాన్‌కు సయితం వినిపించారు. ఇరువురితోనూ శపథం చేయించిన పిదప, “ఉస్మాన్! చెయ్యి లేపండి!!” అన్నారు. ఆ విధంగా ఖలీఫా ఎన్నికను ప్రకటించారు.

అమీర్ (ఖలీఫా) ఎన్నికలో మహనీయ అబ్దుర్రహ్మాన్(ర) జనాభిప్రాయ సేకరణ పట్ల తన ప్రమాణం, బాధ్యతలను ఏ మేరకు నిర్వర్తించారో, మహనీయ ఉమర్ నియమించిన మూడు దివారాత్రులు, ఒక్కొక్క క్షణం ఏ విధంగా వినియో గించారో చెప్పనవసరం లేదు. అయితే ఈ సందర్భంలో ఒక విషయం చెప్పాలి. ఖలీఫా ఎన్నిక వరకు, మహనీయ ఉమర్(ర) ఆదేశం మేరకు నమాజ్ నాయకత్వం (ఇమామత్) ఆయనే నిర్వహించారు. ఖలీఫా ఎన్నిక గురించి ప్రకటన వినడానికి జనులు వచ్చినప్పుడు ఫజ్ర్ నమాజ్ ఆయనే చేయించారు.

## హజ్జ్

హిజ్రీ 24వ సంవత్సరం, ముహర్రమ్ నెలలో మహనీయ ఉస్మాన్ ఖలీఫాగా బాధ్యతలు స్వీకరించిన పది నెలలకు మహనీయ అబ్దుర్రహ్మాన్(ర)కి హజ్జ్ నాయకత్వం అప్పగిం చారు. ఈ విధంగా హిజ్రీ 24వ సంవత్సరం హజ్జ్ మహనీయ అబ్దుర్రహ్మాన్ నాయకత్వంలో జరిగింది.

హజ్జ్ సందర్భంలో మహనీయ ఉస్మాన్(ర) మినాలో నమాజ్ నాలుగు రక'తులు చేయించారు, కస్ర్ చెయ్యలేదు. దాని పట్ల అబ్దుర్రహ్మాన్ తోపాటు సహచర మాన్యులు అభ్యంతరం తెలిపారు. దానికి మహనీయ ఉస్మాన్(ర) జనులకు తెలి పారు, “నేను హరమ్ కాబా నగరంలో వివాహం చేసు కున్నాను, దైవ ప్రవక్త(స), మనిషి పెళ్ళి చేసుకున్న ఊరు అతనికి స్వంత ఊరుతో సమానం అన్నారు. అందువల్ల నేను ఇక్కడ కస్ర్ చేయలేదు.” దానికి మహనీయ అబ్దుర్రహ్మాన్, ఇతర సహచరులు తృప్తి చెందారు.

మహనీయ అబ్దుర్రహ్మాన్(ర), ముగ్గురు ఖలీఫాల కాలం లోనూ వారికి నమ్మకస్తుడయిన సలహాదారుగా మెలిగారు, ఆలోచనాత్మకంగాను క్రియాత్మకంగానూ తన నాయకులకు సహాయపడ్డారు.

## అంతిమ శ్వాస - ప్రత్యేకతలు

మహనీయ అబ్దుర్రహ్మాన్(ర) 72 ఏళ్ళ వయసులో పరమ పదించారు. ఉల్లేఖనాల ప్రకారం మహనీయ ఉస్మాన్ బిన్

అఫ్ఫాన్ (ర) ఆయన జనాజ నమాజ్ చేయించారు. మహనీయ సఅద్ బిన్ అబీ వక్కాస్ శవ పేటికను భుజాన మోశారు. బకీ' ఖనన వాటికలో ఖననం జరిగింది. మహనీయ అలీ(ర) ఆయన పట్ల ఇలా పలికారు, "ఈయన ప్రపంచంలో దాని ఉత్తమ భాగాన్ని గ్రహించారు, చెడు భాగాన్ని వదలి వెళ్ళిపోయారు." సామాన్య ప్రజలు కొందరు ఆయన గోరీని ప్రత్యేకంగా ఆదరించడం మొదలెడితే, దాన్ని సహచర మాన్యులు వెంటనే గట్టిగా వారించారు.

ఆయనకు బహు భార్యల ద్వారా ఇరువైకు పైగా సంతానం, బాల బాలికలు కలిగారు. ఆయన సహచర మాన్యులలో అత్యధిక సంపద గలవారు. అదేవిధంగా అత్యధికంగా దాన ధర్మాలూ చేసేవారు. ఆయన అసంఖ్యాక బానిసల్ని కొని స్వేచ్ఛ కల్పించేవారు. ఒక లెక్క ప్రకారం ఆయన స్వేచ్ఛ కల్పించిన బానిసల సంఖ్య ఇరువై వేలు! జ్ఞాన సముపార్జన లోనూ ఆయన తృష్ణ తీరేది కాదు. తన కన్నా పిన్న వయస్కు లయిన వారి వద్ద సయితం జ్ఞానసముపార్జన కొరకు ఓ విద్యార్థిలా వెళ్ళి కూర్చునేవారు. అదే విధంగా ఆయన ప్రసంగం కూడా ముక్తసరిగా భావగర్భితంగా ఉండేది.

మహనీయ అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ అమితంగా వినయ వినమ్రతలు గల వ్యక్తి. ఎన్నడూ తనకు ప్రత్యేక స్థానం కావాలని కోరుకోలేదు. తాను ఎంతగా సంపాదనా పరులయినా గతాన్ని ఎన్నడూ మరువ లేదు. ఒకసారి బంధు మిత్రుల కొరకు విందు ఏర్పాటు చేశారు. ఆ సందర్భంలో ఉత్తమ మయిన భోజనం వచ్చింది. అది చూసి భోరున రోదించారు. కారణం అడగ్గా, "ప్రవక్త మహనీయులు(స) దివంగతులయి పోయారు కాని ఆయన(స) బార్లీ గింజల రొట్టె కూడా కడుపు నిండా తిని ఎరుగరు!" అని అన్నారు. ✤

# గాజా చిన్నారులను కాపాడుకుందాం!

గాజా చిన్నారులు ఆకలితో అలమటించి మృత్యువాత పడుతున్నారు. పసి పిల్లల ఆక్రందన చూసినవారెవరికైనా కళ్లు చెమర్చకుండా ఉండవు. మానవత్వం ఏ కోశాన ఉన్నా వాళ్లను ఆదుకోవాలని తపిస్తారు. పలస్తీనాకు ఆనుకుని ఉన్న ఈజిప్టు యువకులు గాజా చిన్నారుల ఆక్రందనలకు చలించిపోయారు. చేతులు కట్టుకుని కూర్చునేకంటే ఏదో ఒకటి చేయాలనుకున్నారు. బియ్యం పిండి నింపిన సీసా లను సముద్రంలో వదిలేస్తున్నారు. ఎలాగైనా గాజా చిన్నారులకు చేరుతాయన్నది వారి చిన్ని ఆశ.



ఇస్రాయీల్ జరుపుతున్న మారణహోమంతో గాజాలో ఎక్కడ చూసినా ఆకలి కేకలు వినపడుతున్నాయి. వందల మంది పసి పిల్లలు ఆకలితో మృత్యువాతన పడుతున్నారు. గాజాలో 9 లక్షల మంది పిల్లలు ఆకలితో అలమటిస్తున్నారని బీబీసి నివేదిక చెప్పింది. వారిలో 70 వేల మంది పోషకాహార లోపంతో ఉన్నారని నివేదికలో పేర్కొంది. ఈ పరిస్థితులు మరింత ప్రమాదకరంగా మారే ఆస్కారం ఉందని అంతర్జాతీయ మానవ సేవా సంస్థలు హెచ్చరిస్తున్నాయి. శిశువులకు పట్టేందుకు పాలు లేక బాలింతల బాధలు వర్ణనాతీతం. మానవతా సాయాన్ని కూడా ఇస్రాయీల్ అడ్డుకుంటోందని పలు అంతర్జాతీయ స్వచ్ఛంద సంస్థలు తీవ్రంగా మండిపడుతున్నాయి. "నాలుగు రోజులుగా తినడానికి ఏమీ లేక నా ఇద్దరు పిల్లలు ఏడుస్తున్నారు" - గాజాకు చెందిన ఓ తండ్రి ఆవేదన.

"కనీసం ఒక పిండి బ్యాగయినా దొరుకుతుందేమోననే ఆశతో ఆహార పంపిణీ కేంద్రం దగ్గరకు వెళ్లాను. కానీ, అక్కడకు వెళ్లేసరికి, ఏం చేయాలో తోచలేదు. గాయపడ్డ వారిని కాపాడాలా? చనిపోయిన వారిని తీసుకెళ్లాలా? లేదా ఆహారం కోసం ఎదురు చూడాలా? దేవుడా, నా పిల్లలు తినేందుకు ఒక పిండి సంచి దొరికినా చాలని ప్రార్థన చేశాను" అని మరో తండ్రి తెలిపారు. ఇప్పటివరకూ యుద్ధంలో 59 వేల మంది పలస్తీనియన్లు మరణించారని గాజా ఆరోగ్య సంస్థ తెలిపింది.

‘చరితార్థులు’-2

# షేక్ అలీ సాహెబ్

## (1915 -1972)

90








**9440241727**

బ్రిటిష్ పాలనను, దోపిడీని ఎదిరించిన భారతీయుల చరిత్రలో ప్రజల సమైక్యతే ప్రత్యేక లక్షణమని నిరూపించడం ధ్యేయంగా భారత స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్న ముస్లిం అమర వీరుల గురించి చరిత్రకారుడు, బహుగ్రంథకర్త **సయ్యిద్ నశీర్ అహమ్మద్** రూపొందించిన ఆల్బమ్ **‘చరితార్థులు’ - 2 (తెలుగు)** THE IMMORTALS- 2 (ఇంగ్లీషు) నుండి గీటురాయి పాఠకుల కోసం ప్రత్యేకం

**పదునాలుగేళ్ళ** పిన్న వయస్సులో మహాత్మా గాంధీ బోధనలకు ప్రభావితులై జాతీయోద్యమంలో ప్రవేశించిన షేక్ అలీ సాహెబ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో 1915లో జన్మించారు. ఆయన తండ్రి ముహమ్మద్ యాసీన్, తల్లి తహాసీన్‌బి. కుటుంబ ఆర్థిక పరిస్థితుల మూలంగా చదువును మధ్యలో ఆపేసి షేక్ అలీ చిరు వ్యాపారం ఆరంభించారు. 1929 ఏప్రిల్ మాసంలో మహాత్మాగాంధీ భీమవరం వచ్చారు. ఆ సందర్భంగా ఆయన దర్శనం చేసుకోవడం మాత్రమే కాకుండా ఆయన ప్రసంగంతో అలీ బాగా ప్రభావితులయ్యారు. 1930లో గాంధీజీ పిలుపు మేరకు షేక్ అలీ ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొన్నారు. ఆనాటి నుండి భారత జాతీయ కాంగ్రెస్ సభ్యునిగా అటు జాతీయోద్యమంలో, ఇటు ప్రజాహిత కార్యక్రమాల్లోను పాల్గొంటూ ప్రజల మన్నన పొందారు. ఆ కారణంగా 1936లో భీమవరం పురపాలక సంఘ సభ్యునిగా ప్రజలు ఆయనను ఎన్నుకున్నారు. భారత జాతీయ కాంగ్రెస్ భీమవరం శాఖ బాధ్యులుగా 1941లో గాంధీజీ అనుమతితో వ్యక్తి సత్యాగ్రహంలో ఆయన పాల్గొన్నారు. ఆగ్రహించిన ఆంగ్ల ప్రభుత్వం 1941 జనవరి ఏడున ఆయనను అరెస్టు చేసి నాలుగు మాసాల పాటు రాజమండ్రి కేంద్ర కారాగారానికి పంపింది. ఆ తరువాత 1942 నాటి క్విట్ ఇండియా ఉద్యమంలో చురుగ్గా పాల్గొనడం మాత్రమే కాకుండా శాసనోల్లంఘనలో భాగంగా ప్రభుత్వ కార్యాలయాల ముట్టడి, దాడులు, విధ్వంసం తదితర సంఘటనలలో షేక్అలీ భాగస్వామి అయ్యారు. ఆ కార్యక్రమాల సందర్భంగా జాతీయోద్యమ కార్యకర్తల మీద సాగిన దాష్టీకాన్ని ఎదుర్కొంటూ స్వయంగా పోలీసులతో తలపడ్డారు. జాతీయోద్యమ కార్యకర్తలకు అండదండలు అందిస్తూ ఉద్యమించిన ఆయన చర్యల పట్ల ఆంగ్ల ప్రభుత్వం ఆగ్రహించింది. ఆ కారణంగా 1943 జనవరిలో షేక్ అలీ రెండు సంవత్సరాల జైలు శిక్షకు గురయ్యారు. 1946లో జైలు నుండి విడుదలయ్యాక, అఖిల భారత ముస్లిం లీగ్ ముందుకు తెచ్చిన భారత విభజన ప్రతిపాదనకు వ్యతిరేకంగా ఆయన ఉద్యమించారు. భారతదేశ సమైక్యత–సమగ్రతకు విభజన ప్రతిపాదన భంగకరం అంటూ సభలు, సమావేశాలు నిర్వహించి ముస్లిం లీగ్ నాయకుల వేర్పాటువాదాన్ని ఎదుర్కొన్నారు. స్వజనుల నుండి, ముస్లింలీగ్ నాయకులు, కార్యకర్తల నుండి ఎదురైన భౌతిక– మానసిక దాడులను సహిస్తూ భారత విభజన డిమాండ్‌కు వ్యతిరేకంగా ప్రచారం సల్పారు. మాతృభూమికి స్వాతంత్ర్యం సిద్ధించి, భారత విభజన జరిగాక తమ వెంట పాకిస్థాన్‌కు రమ్మంటూ బంధుమిత్రుల నుండి ఎంతటి ఒత్తిడి వచ్చినా పుట్టిపెరిగిన గడ్డను వదలిపెట్టి ఎక్కడికో వెళ్ళేది లేదని షేక్ అలీ కరాఖండిగా స్పష్టం చేశారు. స్వతంత్ర భారత దేశంలో ప్రజాహిత కార్యక్రమాలలో పాల్గొంటూ ప్రజాసేవకునిగా ప్రజల మన్నన పొందుతూ అత్యంత సామాన్యుడిగా అతి నిరాడంబర జీవితం గడిపిన షేక్ అలీ 1972 జనవరి 24న కన్నుమూసారు. ✤



# హరిహర వీరమల్లు, చరిత్ర వక్రీకరణకు పరాకాష్ఠ

**యండి. ఉస్మాన్ ఖాన్, సీనియర్ జర్నలిస్ట్**

**తెలుగు సినిమా** పరిశ్రమలో ప్రతిష్ఠాత్మకంగా విడుదలైన 'హరిహర వీరమల్లు' చిత్రం చరిత్ర ఆధారంగా రూపుదిద్దినదిగా ప్రకటించబడింది. పవన్ కల్యాణ్ ప్రధాన పాత్రలో నటించిన ఈ చిత్రానికి సామాజిక మాధ్యమాల్లో విపరీతమైన ప్రాచుర్యం లభించింది. అయితే చిత్రంలోని చారిత్రక పరిణామాలు, పాత్రల స్థానం, సంఘటనల కాలగణన రూపంలో అసత్యాలు, అపోహలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఇవి కేవలం కళాత్మక స్వేచ్ఛ పరిమితుల్లో కాకుండా, ఒక మతాన్ని లక్ష్యంగా చేసుకుని విష ప్రచారం చేసే ప్రయత్నంగా అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ఈ సినిమాలో హరిహర వీరమల్లు అనే పాత్ర 14వ శతాబ్దికి చెందినదిగా చూపించారు. నిజానికి ఇది కల్పితపాత్ర. హరిహర వీరమల్లు అనేవాడు చరిత్రలో లేడు. ఒకవేళ వీళ్ళు చెబుతున్న ప్రకారం ఉన్నాడని అనుకున్నా, 1355లో మరణించాడట. 1591లో చార్మినార్ నిర్మాణం జరిగింది. 1618లో ఔరంగజేబు జననం. ఈ సమయాల మధ్య దాదాపు 250 ఏళ్ల వ్యత్యాసం ఉంది. అయినా సినిమాలో హరిహర వీరమల్లు ఔరంగజేబుతో పోరాడినట్లు చిత్రీకరించడం చరిత్రను తారుమారు చేయడమే కాదు, ఒక రాజకీయ దృష్టికోణాన్ని ఉద్దేశ్యపూర్వకంగా జొప్పించే ప్రయత్నంగా పరిగణించవచ్చు.

ఇటీవలి కాలంలో భారతీయ సినిమా, ముఖ్యంగా హిందీ, దక్షిణాది చిత్రాల్లో, చారిత్రక నేపథ్యంలో మత వైషమ్యాన్ని వ్యాప్తి చేసే ధోరణి పెరిగింది. ఉదాహరణకు, ద కశ్మీర్ ఫైల్స్ (2022): కశ్మీరీ పండితుల వ్యథను ప్రధానాంశంగా చూపించిన ఈ చిత్రం, ముస్లిం సమూహాన్ని నిందిస్తూ నిర్మించబడింది. ఈ సినిమాతో దేశవ్యాప్తంగా మత ఘర్షణలు ఉధృతమయ్యాయి. ద కేరళ స్టోరీ (2023): వాస్తవాలను శోధించకుండా, లవ్ జిహాద్ అనే వాదనపై నిర్మించబడిన ఈ చిత్రం కూడా అబద్ధాల పునాదులపైనే నిర్మించబడిందే. తమిళ, తెలుగు చిత్రాల్లోనూ ఇటీవలి కాలంలో ముస్లింలను ఆక్రమణ దారులుగా, వీరులకు ప్రాతినిధ్యంగా హిందువులను చూపించడం గమనించవచ్చు. ఇలాంటి చిత్రాల లక్ష్యం ప్రజల మదిలో మతపరమైన భావోద్వేగాలను రెచ్చగొట్టడం అని విమర్శకులు అభిప్రాయపడుతున్నారు.

అలాగే కొన్ని చిత్రాలు చరిత్రను నిబద్ధతతో, పరిశోధనతో మలచగా, కొన్నింటిలో మాత్రం చరిత్ర ఓ రాజకీయ పావుగా తయారవుతోంది. సినిమాలు వాస్తవ చరిత్రను ఆధారంగా తీసుకొని ప్రజలకు జ్ఞానం పంచే ప్రయత్నం చేయాల్సిన సమయంలో,

హరిహర వీరమల్లు లాంటి చిత్రాలు మాత్రం చరిత్రను వక్రీక రించి, ముస్లిం పాలకులపై అర్థం పర్థం లేని అపవాదాలు మోపుతున్నాయి.

ఇదంతా చూస్తే, చరిత్రను వక్రీకరించడంలో అసలు ఉద్దేశం ఏమిటో స్పష్టంగా అర్థమవునూ వుంది. ఇది చరిత్రపై ప్రేమ కాదు, ప్రస్తుత రాజకీయ అవసరాల కోసం మత విద్వేషాన్ని రెచ్చగొట్టే ప్రయత్నం. గతాన్ని అర్థం చేసుకునే పరిజ్ఞానంతో కాకుండా, ద్వేషంతో తీర్చిదిద్దే యత్నం. గతంలో మొఘలె ఆజం వంటి చరిత్రాత్మక ప్రేమకథలు ఒక ముస్లిం పాలకుని మనిషి తనాన్ని, ప్రేమను, సామరస్యాన్ని చూపిస్తే, హరిహర వీరమల్లు వంటి సినిమాలు ముస్లిం చక్రవర్తులెవ్వరూ దేశభక్తులే కాదన్న తప్పుడు సంకేతాల్ని సమాజంలో జొప్పిస్తున్నాయి. ఇది కళను మత కోణంలో చూపించైనా సమాజాన్ని చైతన్య వంతంగా మార్చడం కాదు, దేశంలో సమాజంలో చీలికలు తెచ్చి, కులాల మధ్య మతాల మధ్య చిచ్చు పెట్టే కుయుక్తిగా కనబడుతోంది.

కళకు కల్పనా స్వేచ్ఛ అవసరం. కానీ అది చరిత్రను వక్రీకరించి, సమాజాన్ని విభజించే స్థాయికి వెళ్తే, అది కళ కాదు కక్ష అవు తుంది. చలనచిత్రాలు ప్రజల మనోభావాలను ప్రభావితం చేసే శక్తివంతమైన మాధ్యమాలు. అలాంటిది ఒక మతాన్ని దుష్ట శక్తిగా చిత్రీకరించటం ద్వారా ప్రజల మధ్య చిచ్చు పెట్టడం ఎంత బాధ్యతారహిత చర్యో ఊహించవచ్చు. ఇలాంటి కథనాలు, చలనచిత్రాలు పదే పదే వెలువడుతుండడం వల్ల, యువతలో మతపరమైన అహంకారం, ద్వేష భావనలు, అసహన సంస్కృతి పెరుగుతున్నాయి. ఈ దుష్పరిణామం కేవలం సినిమాలకే పరిమితం కాకుండా, జాతీయ సమగ్రతను ప్రమాదంలోకి నెట్టే పరిస్థితి దాపురించింది.

అయితే అన్ని చిత్రాలూ ఇలానే ఉన్నాయని చెప్పలేం. భారతీయ ముస్లింల దేశభక్తి, త్యాగాలను చూపించే కొన్ని చిత్రాలు మనకు ప్రేరణనిస్తాయి: షేర్షా, సర్దార్ ఉదమ్, చక్ దే ఇండియా, మై నేమ్ ఈజ్ ఖాన్ వంటి చిత్రాలు మతపరంగా కాక, మానవతా విలువలతో రూపొందించబడ్డ కథనాలుగా నిలుస్తాయి. పాత తెలుగు చిత్రాలు కూడా సామరస్యాన్ని, సమైక్యతను పెంపొందిం చేవిగా ఉండేవి. ఇవే నిజమైన చలనచిత్ర సామర్థ్యాన్ని చూపే ఉదాహరణలు.

హరిహర వీరమల్లు వంటి చిత్రాలు చరిత్రను నాటకీయత కోసం వక్రీకరించి, ఒక మతాన్ని అప్రతిష్ఠకు గురిచేసే దిశగా చేసిన పకడ్బందీ ప్రయత్నం. ఇది కేవలం కథల విషయంలోనే కాదు, సమాజపు మానసిక దృక్పథాన్ని కూడా ప్రభావితం చేస్తుంది. మనకు విలువలను, వినోదాన్ని పంచే సినిమాలు కావాలి. కక్షలు, కార్పణ్యాలు పెంచే కథలు కాదు. సినిమాలు కల్పితాలతో కాదు, నిజాలతో నిండి ఉండాలి. చరిత్రను ధ్వంసం చేసి, భయాలను వ్యాపింపజేసే విష కథనాలకు బదులు, భవిష్యత్తును నిర్మించే చైతన్యాన్ని నింపే కథలే నేటి అవసరం.

ఇందులో మరొక బాధాకరమైన అంశం ఏమిటంటే, పవన్ కళ్యాణ్ లాంటి గొప్ప ప్రాచుర్యం కలిగిన రాజకీయ నాయకుడు, ఓ సామాజిక బాధ్యత కలిగిన వ్యక్తిగా గుర్తింపు పొందినవాడు, ఇలాంటి అబద్ధపు చరిత్ర ఆధారంగా నిర్మితమైన సినిమాకు కథానాయకుడిగా పనిచేయడం. తన మాటలు, తన పనులు సమాజంపై ఎంతటి ప్రభావం చూపుతాయో తెలిసిన వ్యక్తిగా, సమాజం ఆయన నుండి మరింత జాగ్రత్త, వివేచన ఆశించటం సహజం. వాస్తవాన్ని వక్రీకరించే సినిమా కంటే, వాస్తవాన్ని నిలబెట్టే వ్యక్తిత్వాన్ని పవన్ కళ్యాణ్ నుండి ప్రజలు కోరతారు. అలాంటి ఆశలను పవన్ విస్మరించడం శోచనీయమైన విషయం.

చరిత్రపై సరైన అవగాహన కలిగి ఉండాల్సిన స్థాయిలో ఉన్న ఒక నాయకుడిగా పవన్ కళ్యాణ్ జాగ్రత్తగా, వివేకంతో, బాధ్యతతో వ్యవహరించాల్సిన అవసరం ఉంది.

సినిమా కేవలం వినోదం కోసం కాదు. అది భావోద్వేగాలను మలచగలదు. నిజాలను చెబుతుందో, తప్పుదారి చూపుతుందో అనేది ప్రేక్షకుల చైతన్యం మీద ఆధారపడి ఉంటుంది. అలాంటి శక్తివంతమైన మాధ్యమం వక్రీకృత చరిత్రను ప్రమోట్ చేస్తే, అది మత సంబంధాలను, సామాజిక మన్ననలను తీవ్రంగా దెబ్బతీస్తుంది. నిజానికి చరిత్రను అర్థం చేసుకునే అవసరం ఉన్న తరుణంలో, చరిత్రనే తిరస్కరించడం భావితరాల మనసులను మలినం చేస్తుంది.

పవన్ కళ్యాణ్ జనసేన అధినేతగా, ఒక రాష్ట్రానికి ఉప ముఖ్య మంత్రిగా ఉన్న వ్యక్తిగా, ఇలాంటి సందర్భాల్లో మరింత బాధ్యతగా వ్యవహరించాలి. క్షణిక లాభాలకోసం అబద్ధపు చరిత్రలను ప్రచారం చేయడం ప్రజల నమ్మకాన్ని అపవిత్రం చేయడమే. దీని వలన కలిగే మానసిక కల్లోలం, మతసామరస్యంపై పడే ప్రభావం చాలా తీవ్రం. ఇతిహాసాన్ని వక్రీకరించే ప్రతి ప్రయత్నం, మన సంస్కృతి మీద, మన సమైక్యత సమగ్రతలపై దాడిగానే పరిగణించాలి. కనుక పవన్ కళ్యాణ్ వంటి నాయకులు వక్రీకృత కథనాలపై ఆధారపడకుండా వాస్తవ చరిత్ర ఆధారంగా చిత్తశుద్ధితో చరిత్రపట్ల ఆత్మబోధతో, సమా జానికి ఉపకరించే కథనాలపై దృష్టి పెడతారని ఆశిద్దాం. ✤

పుస్తక సమీక్ష

## సమకాలీన ప్రపంచానికి సరైన దిక్సూచి

# ఆదర్శమూర్తి ముహమ్మద్ (స)




**యండి. ఉస్మాన్ ఖాన్, సీనియర్ జర్నలిస్ట్**

**చీకటి నిండిన చరిత్రలో** వెలుగు కిరణంగా, విలువల పతనాన్ని నిరోధించిన మనీషిగా, మానవతా సంస్కృతికి మార్గదర్శిగా వచ్చిన మహా పురుషుడు ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం). ఆయన జీవితం ఓ గొప్ప సందేశం. ఓ జీవన గ్రంథం. ఓ నిశ్చల దీపం. ఆయన నడక మానవతా మార్గం. ఆయన మౌనం కూడా ప్రకాశించే ప్రవచనమే. ప్రపంచం అంధకారంలో మునిగిన సమయంలో, విలువలకు కొత్త అర్థం చెప్పిన శాశ్వత శాంతిసూత్రం ఆయనే. ఆ మహనీయుని విప్లవాత్మక మానవీయ జీవితాన్ని తేటతెలుగులో పరిచయం చేసిన పుస్తకమే **'ఆదర్శ మూర్తి ముహమ్మద్ (స)'.**

### ప్రపంచం దృష్టిలో ప్రవక్త ముహమ్మద్ (స)

ప్రపంచ చరిత్రలో భావోద్వేగాలను, విలువలను, సమాజ నిర్మాణాన్ని సమకాలీన దృష్టితో మిళితం చేయగలిగిన అతి కొద్దిమంది నాయకుల్లో అగ్రగణ్యులు దైవప్రవక్త ముహమ్మద్ (స). ఆయన జీవితం మత సూత్రాలకు మాత్రమే కాక, మానవతా ప్రమాణాలకు, సామాజిక నైతికతకు, కుటుంబ సమరసతకు మార్గదర్శిగా నిలుస్తుంది.

మానవత్వానికి పరిపూర్ణ ప్రతిరూపంగా, అన్ని విభాగాల పట్ల సమాన దృష్టికోణాన్ని కలిగిన నాయకుడిగా ఆయన నిలిచారు. ఎట్టి పరిస్థితిలోనూ విలువలతో రాజీపడకుండా, సహనంతో, సహృదయంతో ప్రతిస్పందించిన ఆయన జీవితం, నేటి ప్రపంచానికి అవసరమైన మానవతా చైతన్యం.

ఈ దృక్కోణాన్ని తేట తెలుగులో ప్రేరణాత్మకంగా పరిచయం చేసిన గ్రంథమిది. ఇది ఒక బయోగ్రఫీ కాదు, ఒక బోధన, ఒక చైతన్య దీప్తి.

ఎస్.ఎమ్. మలిక్, ఖుర్ఆన్‌ను తెలుగులో ప్రతిధ్వని చేసిన అనువాదకుడు, పదాల్లో పరిమళాన్ని నింపిన కవి, గీటురాయి వారపత్రిక సంపాదకునిగా సమకాలీన స్పర్శను పొందిన మేధావి. ఆయన ముహమ్మద్ (స) జీవితాన్ని ధర్మగాథగా కాక, మానవగాథగా, విలువల యాత్రగా చిత్రించారు. పఠనానికి కాక, పునరాలోచనకు ప్రేరణనిచ్చే రచన ఇది.

అభిజ్ఞత, అనుభవం, ఆధ్యాత్మిక స్పందన– ఈ మూడింటి మేళవింపుతో రచయిత ఈ పుస్తకాన్ని రూపుదిద్దారు. ఆయన దృక్పథంలో మతపరమైన అతివాదం లేదు. విలువల పట్ల నిబద్ధత ఉంది.

అత్యంత సున్నితమైన విషయాలనూ స్పష్టంగా, శాంతంగా, లోతుగా చెప్పగల రచయితగా ఆయన ప్రతిభ సుపరిచితమే.

### లోతైన అధ్యాయాలు

21 అధ్యాయాలుగా విభజించినప్పటికీ, ప్రతి అధ్యాయం ఒక ఆత్మాన్వేషణగా మారుతుంది. 'ప్రవక్త మానవుడే!' అనే మొదటి అధ్యాయం నుంచే రచయిత స్పష్టమైన బాణీతో పాఠకుడిని సంబోధిస్తారు. ప్రవక్తను శాశ్వత మానవ విలువల ప్రతీకగా పరిచయం చేస్తారు.

ఇందులో గల ప్రతి అధ్యాయం ఒక జీవిత పాఠంగా నిలుస్తుంది. ఎటువంటి ఆర్భాటం లేకుండా, విశ్లేషణతో, వివరణతో, విలువల బీజాంశాలతో నింపబడ్డ అధ్యాయాలు పాఠకుడిని ఉక్కిరి బిక్కిరి చేస్తాయి.

పుట్టుక, బాల్యం, ధ్యానం, ధర్మబోధన, నాయకత్వం, కుటుంబ వ్యవహారాలు, ప్రతి అంశం రచయిత సున్నితంగా, విశ్లేషణాత్మకంగా చిత్రీకరించారు. కొన్ని సందర్భాల్లో అధ్యాయాలు మనల్ని ప్రశ్నించేలా ఉంటాయి. చదవడమే కాక, మనలో మార్పుకు ప్రేరణగా నిలుస్తాయి.

### భాషా శైలి - నిశ్శబ్ద వైభవం

మలిక్ గారి శైలిలో ఆవేశం లేదు, ఆక్రమణ లేదు. కానీ హృదయాన్ని తాకే నిశ్శబ్ద వైభవం ఉంది. శబ్దాలకన్నా సందేశానికే విలువ ఇస్తారు. భావాలకు వెలుగులాంటి పదాలు ప్రశాంత ప్రవాహంగా వెదజల్లబడ్డాయి.

ఆయన రచనల్లో అనవసరపు ఆర్భాటం ఉండదు. కానీ ప్రతీ పదం మౌనంగా మన అంతరంగాన్ని తాకుతుంది. లోతైన పదచిత్రణ, ఉపమానాలలోని గంభీరత, భావాలకు లయతో కలిపే శబ్దశక్తి – ఇవన్నీ కలిసినప్పుడు పాఠకుడికి ఇది కేవలం పఠనం కాకుండా ఒక అంతర్యాత్రగా మారుతుంది.

కవిత్వం లాంటి ఫ్లో ఉన్నా కూడా రచన ఎక్కడా అలజడికి లోనుకాదు. ప్రతీ అభివ్యక్తిలో బాధ్యత, ప్రతీ వాక్యంలో స్పష్టత ఉంటుంది.

## చరిత్ర కంటే విలువల కథనం

చరిత్ర కేవలం కాలపు గణాంకం కాదు. ఆ కాలంలో శ్వాసించిన విలువలే సమాజాన్ని నడిపే శక్తి. ఈ గ్రంథంలో ప్రవక్త జీవితం క్రమబద్ధమైన వరుసగా కాక, విలువల దారిలో నిర్మితమైన రచనగా తళుక్కుమంటుంది.
ఆయన చూపిన క్షమ, శాంతి, ధైర్యం, సమానత్వం వంటి విలువలను ఖురాన్ వచనాలతో, చారిత్రక ఉదాహరణలతో రచయిత శాస్త్రీయంగా అర్ధవంతంగా వివరించారు.

ఈ అధ్యాయాల్లో మతంపై కాకుండా, మానవతా దృక్పథంపై ప్రధానత ఉంటుంది. పాఠకుడు మతాన్ని గౌరవిస్తూ, తన జీవితం, కుటుంబం, సమాజం కోసం ఏం నేర్చుకోవాలో స్పష్టంగా అర్థమవుతుంది.

ఇది విశ్వాసాన్ని బలపరచే రచన మాత్రమే కాదు, మనిషిని మరింత మంచి మనిషిగా తీర్చిదిద్దే మార్గదర్శక గ్రంథం.

21వ శతాబ్దపు రాజకీయ అసమానతలు, కుటుంబ వ్యవస్థల క్షీణత, మతాధిక్యపు భయం, ఆర్థిక దోపిడి వంటి సమస్యలకు ఈ గ్రంథం విలువైన ప్రతిస్పందనగా నిలుస్తుంది. 7వ శతాబ్దపు నేపథ్యాన్ని నేటి ప్రపంచానికి అన్వయించగల రచయిత మలిక్ గారి సామర్థ్యం ఈ గ్రంథానికి చిరస్థాయితనాన్ని అందిస్తుంది.

ఈ రచనలో ప్రవక్త (స) గతానికి చెందిన చరిత్ర పురుషుడిగా కాక, నేటి సంక్షోభాల పరిష్కార సారథిగా, మార్గదర్శకుడిగా దర్శనమిస్తారు.

సామాజిక వైపరీత్యాలు, రాజకీయ మత మౌలికవాదంపై స్పందన, కుటుంబ సంబంధాలపై మౌలిక దృక్పథం ఈ గ్రంథంలో కనిపిస్తుంది.

ప్రతి సమకాలీన సమస్యకు ఆయన జీవితం ద్వారా వెలుగు చూపిస్తారు. ఇది ఓ కాలానికి మాత్రమే చెందిన పాఠం కాదు, మనకు నిత్యావసర మార్గం.

## మలిక్ గారి శైలిలో నాలుగు శక్తులు మిళితం

అనువాదకుడిగా ఖురాన్‌పై సాధన, కవిగా పదబంధాలపై లోతైన ఆలోచన, సంపాదకుడిగా సమకాలీన దృష్టి, తాత్వికుడిగా అంతర్గత సంభాషణ – ఈ నాలుగు శక్తుల సమ్మేళనమే ఈ రచనను ఆధ్యాత్మికతను మించిన మానవతా మార్గదర్శిగా మలుస్తుంది.

ఆయన వాక్యాల్లో నిగూఢత ఉంది. భాషలో నిరాడంబరత ఉంది. వ్యక్తీకరణలో నిబద్ధత ఉంది. ఈ సమ్మేళనమే రచనను అపురూపంగా నిలబెడుతుంది.

పాఠకుడు ఈ గ్రంథాన్ని చదివినపుడు, రచయిత మాట వినిపిస్తున్నట్టుగా అనిపిస్తుంది. కానీ ఆ మాట లోలోపలే మౌనంగా దిశానిర్దేశన చేస్తుంది.

ఈ గ్రంథం ఒక పఠన ప్రయాణం కాదు, జీవిత మార్పుకు దారితీసే ఆధ్యాత్మిక ప్రయాణం.

పుటలు తిప్పడం కాదు, హృదయాలను మారుస్తూ, ఆలోచనలను మలచే శక్తి.

ముహమ్మద్ (స) జీవితం మతగ్రంథాలకే పరిమితమైన అధ్యాయం కాదు, అది నేటి మానవ సంక్షోభాలకు సమాధానంగా నిలబడే తాత్విక శక్తి కూడా!

ఆయన చూపిన దయ, ధైర్యం, ధర్మం జీవిత విధానంగా మారాల్సిన అవసరాన్ని ఈ గ్రంథం చాటిచెబుతుంది.

ఈ గ్రంథం పాఠకుడిని తాత్వికతకు మాత్రమే కాదు, మనిషి తనానికి దగ్గర చేయగలదనే విశ్వాసాన్ని కలిగిస్తుంది.

ఇది చదవటం వల్ల నమ్మకం మారదు, మనిషి మారతాడు.

'ఆదర్శమూర్తి ముహమ్మద్ (స)' చదివిన పాఠకునికి, ప్రవక్త జీవితం ఒక వ్యక్తి చరిత్రగా కాక, విప్లవాత్మక మానవ సంస్కృతిగా గోచరిస్తుంది.

ఇది ఆధ్యాత్మికతను మించిపోయే స్థాయిలో ఓ సామాజిక మేల్కొలుపు.

ఈ గ్రంథం పఠనం కోసం కాదు, జీవితాన్ని జ్ఞానంతో తీర్చిదిద్దుకునేందుకు.

ఇది ఆలోచన కోసం కాదు, ఆచరణలో మార్పును సృష్టించేందుకు.

ఇది విశ్వాసానికి పునాది మాత్రమే కాదు, మానవతను అలంకరించే జ్ఞాన విప్లవానికి ఆహ్వానం. అందరూ అవశ్యంగా చదవవలసిన అపురూప పుస్తకం.

పుస్తకం పేరు: **ఆదర్శమూర్తి ముహమ్మద్ (స)**
రచయిత: **ఎస్. ఎమ్. మలిక్**
లభించు చోటు: **తెలుగు ఇస్లామిక్ పబ్లికేషన్స్ ట్రస్ట్**
సందేశ భవనం, లక్కడ్‌కోట్, హైదరాబాద్.
**ఫోన్ నెంబర్: 9700255736, 9490627650.**
పేజీలు: 516 **వెల: 400/-** ✤




**నేటి** యుగంలో ఒక ముఖ్యమైన సమస్య వాతావరణ మార్పులు (Climate Change). భూ తాపం (Global Warming) ఇందుకు ప్రధాన కారణం. చెట్ల నరికివేత, కాలుష్య కారక పరిశ్రమలు, సముద్ర గర్భాల్లో తవ్వకాలు, వాహనాల అతి వినియోగం, వ్యర్థాలను ఎక్కువగా ఉత్పత్తి చేసే వస్తువుల వాడకం వంటివి భూ తాపానికి కారణాలు. దీనివల్ల వర్షాలు తగ్గిపోతున్నాయి, ఎండలు అధికమవుతున్నాయి, కరువు, వరదలు వంటి సమస్యలు పెరిగిపోతున్నాయి.

ఇస్లాం దైవికంగా అవతరించిన సంపూర్ణ జీవన విధానం. ఇది మనిషి జీవితంలోని ప్రతి రంగంలో మార్గదర్శనం చేస్తుంది. ఈ ధర్మం మనిషి సహజ స్వభావానికి అనుగుణంగా ఉంటుంది. దీనిలో మానవ జీవితానికి సంబంధించిన ప్రతీ సమస్యకు పరిష్కారం ఉంది. పర్యావరణ పరిరక్షణ విషయంలోనూ స్పష్టమైన మార్గదర్శకాలను ఇస్లాం ఇచ్చింది. ఇస్లాం బోధనల్లో ప్రముఖ అంశం "మొక్కలు నాటడం". చెట్లు మనిషికి మేలు చేస్తాయి. భూమికి అందాన్ని ఇస్తాయి. మొక్కల ప్రాముఖ్యతను, వాటిని నాటాల్సిన అవసరాన్ని పద్నాలుగు శతాబ్దాల క్రితమే ఇస్లాం చెప్పింది. ఈ విషయాన్ని నేటి శాస్త్ర విజ్ఞానం కూడా అంగీకరించింది. చెట్లు వాతావరణాన్ని శుభ్రంగా ఉంచుతాయి. అన్ని జీవులకూ ఆరోగ్యవంతమైన వాతావరణం కలిగించడం కోసం అవి తప్పనిసరి.

"షజర్" అనే అరబిక్ పదానికి చెట్టు అని అర్థం. ఈ పదం ఖుర్ఆన్‌లో 26 సార్లు వచ్చింది. "జన్నత్(తోట)" అనే పదం 66 సార్లు వచ్చింది. ఖుర్ఆన్‌లో "పండ్లు" అనే పదం కూడా అనేకసార్లు కనిపిస్తుంది. ఇవన్నీ చెట్ల ప్రాముఖ్యతను తెలుపుతున్నాయి. ప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (స) బోధనలు కూడా చెట్ల ప్రాముఖ్యతను చాటుతున్నాయి. ఆయన ఖుత్బాలు (ప్రసంగాలు) ఇచ్చినప్పుడు ఖర్జూర చెట్టు దగ్గర నిలబడేవారు.

**కొన్ని హదీసులు చెట్ల ప్రాముఖ్యతను ఇలా వివరించాయి**

"ఎవరైనా ఒక మొక్కను నాటి, ఆ మొక్క పండ్లను మనుషులు లేదా పశు పక్ష్యాదులు తింటే, అది ఆ వ్యక్తి పాలిట సదఖా (దానము)గా లెక్కించబడుతుంది" (తిర్మిజీ).

"ప్రపంచం చివరి క్షణాల్లో అయినా సరే, ఎవరి చేతిలోనైనా ఓ మొక్క ఉంటే, దాన్ని నాటాలి". (ముస్నద్ అహ్మద్).

"ఉపదేశించిన జ్ఞానం, నీతిమంతులైన సంతానం, నిర్మించిన మసీదు, నిర్మించిన అతిథి గృహాలు, నీటి కాలువలు, నాటిన చెట్లు, చేసిన దానం... ఈ మంచి పనులన్నీ మనిషి చనిపోయాక కూడా ఉపయోగపడతాయి" (ఇబ్నె మాజా).

మొక్కల పెంపకం మానవత్వానికి చిరునామాగా నిలుస్తుంది. చనిపోయాక కూడా మానవుడికి లభించే సదఖా పుణ్యాల్లో చెట్లు నాటడం ఒకటి. మనం నాటే మొక్కల వల్ల ఇతరులకు మేలు కలిగితే, మనం చనిపోయాక కూడా మనకు పుణ్యం లభిస్తుంది. అది ఒక సత్కార్యంగా పరిగణించబడుతుంది. మొక్కలు నాటడం వల్ల భవిష్యత్తు తరాలకు మేలు జరుగుతుంది. చెట్లు మన ఆరోగ్యానికి కీలకం. కొన్ని చెట్ల దగ్గర కూర్చోవడం వల్లే ఆరోగ్యవంతులయ్యే అవకాశాలు ఉంటాయి. కొన్ని ఔషధాలు కూడా చెట్ల నుంచి తయారవుతాయి. అందుకే మొక్కలు నాటడాన్ని, చెట్ల సంరక్షణను సేవా కార్యక్రమంగా భావించాలి. ప్రతి వ్యక్తి, సంఘం, సమాజం కలిసి మొక్కలు నాటడంపై దృష్టి పెట్టాలి. ❖





# చిన్నారులను పర్యావరణ ప్రేమికులుగా మలుచుటకు, పసి హృదయాలలో దేశభక్తి నింపుటకు జాతీయ స్థాయిలో మొక్కలు నాటే ఉద్యమం

## నంద్యాలలో రాష్ట్ర స్థాయి ముగింపు కార్యక్రమంలో జేఐహెచ్ ఆం.ప్ర రాష్ట్ర అధ్యక్షులు ముహమ్మద్ రఫీఖ్

జమాఅతె ఇస్లామీ హింద్ బాలల విభాగం "చిల్డ్రన్స్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్" ఆధ్వర్యంలో జూన్ 25 నుండి జూలై 25 వరకు జాతీయ స్థాయిలో మొక్కలు నాటే ఉద్యమం నిర్వహించింది. ఈ సందర్భంగా దేశవ్యాప్తంగా చిన్నారులతో పది లక్షల మొక్కలు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో లక్ష మొక్కలు నాటే కార్యక్రమం కొనసాగు తోంది. 'మట్టిలో చేతులు- మనసులో దేశం' నినాదంతో నంద్యాల ఉర్దూ జూనియర్ కళాశాల వేదికగా జరిగిన రాష్ట్ర స్థాయి ప్లాంటేషన్ ముగింపు సమావేశానికి జమాఅతె ఇస్లామీ హింద్ ఏ.పీ. రాష్ట్ర అధ్యక్షులు జనాబ్ ముహమ్మద్ రఫీఖ్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన నంద్యాల మున్సిపల్ చైర్‌పర్సన్ శ్రీమతి మహబున్నిసా కార్యక్రమంలో భాగంగా పిల్లలతో కలిసి కళాశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పర్యావరణాన్ని పరిరక్షించే బాధ్యత పిల్లల హృదయాలలో నింపుటకు దేశవ్యాప్తంగా పది లక్షల మొక్కలు నాటే బృహత్ కార్యక్రమానికి జమాఅతె ఇస్లామీ హింద్ సంస్థ నాంది పలకటం హర్షనీయమని, ఇది గొప్ప ఆదర్శనీయమనీ అన్నారు. ఈ పరంపరలో నంద్యాలలో ఆరువందల మొక్కలు నాటినందుకు నంద్యాల సిఐఓ కృషిని అభినందించారు. అనంతరం జనాబ్ ముహమ్మద్ రఫీఖ్ మాట్లాడుతూ, దేశ సేవ అంటే జైహింద్ అనడమే కాదని, దేశంలో పర్యావరణాన్ని కాపాడటం, ప్రకృతి వనరులు పరిరక్షించడం దేశభక్తిలో అంతర్భాగం అన్నారు. ప్రపంచ వ్యాప్తంగా సామ్రాజ్య వాదులు అడవులను నరికి పర్యావరణాన్ని నాశనం చేస్తున్నారని, చైనా, అమెరికాతో పాటు దౌర్భాగ్యంగా మన దేశం కూడా అందులో ఉందన్నారు. అమెజాన్ అడవులు 35% నాశనం చేయబడ్డాయి తద్వారా కాలుష్యం పెరుగుతుందన్నారు. దీనిద్వారా ఉత్పన్నమయ్యే శ్వాసకోశ వ్యాధుల వల్ల రోజుకు వేలాది మంది మరణిస్తున్నార న్నారు. ఒక మొక్క 100 కిలోల ఆక్సిజన్ ఇస్తుందని, కార్బన్ డయాక్సైడ్ పీల్చుకుంటుందనీ అందుకే పర్యావరణ పరిరక్షణ పట్ల చిన్నారులకు అవగాహన కలిగించుటకు పిల్లలతో మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్టు తెలిపారు. జనాబ్ రఫీఖ్ ఇస్లాం వెలుగులో పర్యావరణ ఆవశ్యకతను ఉద్ఘాటిస్తూ మొక్కలు నాటడం పవిత్ర విధిగా భావించాలని, మొక్కల వల్ల పశు పక్ష్యాదులకు కలిగే ప్రయోజనం కూడా వాటి పరిరక్షకులకు పుణ్యకార్యంగా లభిస్తుందన్నారు. ప్రవక్త ముహమ్మద్ (స) చెట్లను నరకడాన్ని వారించారు, యుద్ధాల్లో సైతం మొక్కలను నాశనం చేయరాదని హితవు పలికారు. కార్యక్రమంలో హాజరైన రాష్ట్ర జేఐహెచ్ మహిళా సహాయ కార్యదర్శి ఫిర్దౌస్ అఖ్తర్ మాట్లాడుతూ పిల్లల్లో సృజనాత్మకత పెంచుటకు చిల్డ్రన్స్ ఆర్గనైజేషన్ నిర్వహించే కార్యక్రమాలు వివరించి పిల్లలు తల్లిదండ్రుల పట్ల ఎలా ఉండాలో తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ కరీముల్లా మాట్లాడుతూ వృక్ష సంపద వల్ల కలిగే ఫలాలు వివరించారు. స్థానిక మున్సిపల్ కౌన్సిలర్స్ సోమశేఖర్ రెడ్డి, సాయినాథ్ రెడ్డి సిఐఓ ఉద్యమాన్ని ప్రశంసించారు. స్థానిక బాధ్యులు అబ్దుల్ సమద్ అతిథులను ఆహ్వానించి సిఐఓ ఆధ్వర్యంలో వివిధ దశల్లో నిర్వహించిన కార్యక్రమాలను వివరించారు. రాణించిన చిన్నారులకు అతిథుల చేతుల మీదుగా మెమోంటోలు బహూకరించారు. చిన్నారుల నాటికలు, గేయాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో సిఐఓ చిన్నారులు, కళాశాల విద్యార్థినులు, జమాఅత్ క్యాడర్ పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

**రిపోర్టింగ్ : షేక్ అబ్దుల్ సమద్, నంద్యాల**

అపార కృపాశీలుడు పరమ కరుణామయుడు అల్లాహ్ పేరుతో

తఫ్‌హీముల్ ఖుర్‌ఆన్: మౌలానా సయ్యిద్ అబుల్ ఆలా మౌదూది     ఖుర్‌ఆన్ అవగాహనం: ఎస్.ఎమ్. మలిక్

35 ఆయత్‌లు     మక్కా అవతరణ

# 46. అల్ అహ్‌కాఫ్

16–20 ఇటువంటి జనుల నుండి మేము వారి ఉత్తమమయిన ఆచరణల్ని స్వీకరిస్తాము, వారి తప్పుల ఎడల చూపోపు వహిస్తాము.[21] వీరు స్వర్గవాసులయిన వారిలో చేరిపోతారు – వారికి చేయబడుతూ ఉన్న సత్య వాగ్దానం ప్రకారం. మరే వ్యక్తి అయితే తన తల్లిదండ్రులకు ఇలా చెబుతాడో, "అబ్బబ్బ, నన్ను వేధించారు మీరు, నన్ను భయ పెడు తున్నారా? నేను మరణించిన తరువాత తిరిగి గోరి నుండి తీయబడతానని? వాస్తవంగా నాకన్నా ముందు అనేక తరాలు గతించాయి, (వారిలో నుంచి ఏ ఒక్కడూ లేచి రానేలేదు)." అతని తల్లీతండ్రీ అల్లాహ్ పేరిట అతనికి చెబుతారు,"ఓరి దౌర్భాగ్యుడా, నమ్మరా, అల్లాహ్ వాగ్దానం సత్యమయినది" అని. కాని అతను చెబుతాడు, "ఇవన్నీ పాతకాలపు బూజుపట్టిన కథలు" అని. దైవశిక్షా యాతన తమకు విధితమయి అతుక్కుపోయిన జనులు వీరు. వీరికి పూర్వం జిన్నులూ మానవుల ఏ ముఠాలు (ఇటువంటి కోవకు చెందినవారే) గతించాయో వారిలోనే వీరున్నూ చేరిపోతారు. నిస్సందేహంగా వీరు నష్టంలో ఉండిపోయే జనమే.[22] ఇరువర్గాలలోనూ ప్రతి ఒక్కరి అంతస్థులు వారి ఆచరణలను బట్టి ఉంటాయి. తద్వారా అల్లాహ్ వారి ఆచరణకు పూర్తి ప్రతిఫలాన్ని వారికి ఇవ్వాలని. వారికి ఎంతమాత్రం అన్యాయం చేయడం జరగదు.[23] తరువాత ఈ తిరస్కారులు అగ్ని సమక్షంలో తెచ్చి నిలబెట్టబడినప్పుడు వారికి చెప్పడం జరుగుతుంది, "మీరు మీ వాటా సౌభాగ్యాలను మీ ఇహలోక జీవితంలోనే పూర్తి చేసుకున్నారు, వాటి మజాలు మీరు జుర్రుకున్నారు. ఇక భువిలో ఎటువంటి హక్కు లేకుండానే మీరు చూపిన అహంకారం, మీరు చేసిన అవిధేయతలు–వీటికి శాస్తిగా నేడు మీకు పరాభవపూర్వకమయిన యాతన విధించబడుతుంది."[24]

21. అంటే, ప్రపంచంలో వారు చేసిన ఉత్తమోత్తమ ఆచరణ రీత్యానే పరలోకంలో వారి స్థానం నిర్ణయమవుతుంది. వారి పొరపాట్లు, బలహీనతలు, తప్పిదాలను పట్టించుకోవడం జరగదు. ఒక మహా సౌహార్ద్రప్రియుడు, విలువ నెరిగిన స్వామి, తన సేవకుడు, విశ్వసనీయుడయిన ఉద్యోగికి విలువనివ్వడం అన్నది, అతని చిన్న చిన్న సేవలను బట్టి కాదు, అతడు చేసిన ఏదయినా గొప్ప కార్యసిద్ధి ఫలితంగా ఇస్తాడు లేదా త్యాగనిరతి, స్వామి ప్రియతలో గొప్పదనాన్ని చూసి ప్రదానం చేస్తాడు. ఇటువంటి నౌకరు విషయంలో చిన్న చిన్న పొరపాట్లను పట్టుకుని అతను చేసిన సేవలనన్నింటినీ నీరు గార్చడు.

22. ఇక్కడ రెండు విధాల పాత్రలను ఎదురుబొదురుగా పెట్టి శ్రోతల సమక్షంలో ఒక మౌన ప్రశ్న ఉంచడం జరిగింది. ఈ రెండు పాత్రల్లో ఏ పాత్ర ఉత్తమమయిందో చెప్పండి అన్నట్టు. ఆ సమయంలో ఈ రెండు పాత్రలూ సమాజంలో క్రియాత్మకంగా ఉన్నాయి. ప్రజలు, మొదటి కోవకు చెందిన పాత్ర ఎక్కడ ఉందో, రెండవది మరెక్కడ అగుపిస్తుందో తెలుసుకోవడం ఏమంత కష్టమయిన పనీ కాదు. ఇది నిజానికి కురైష్ నాయకుల మాటకు సమాధానం. వారు, ఈ గ్రంథాన్ని నమ్మడం ఏమయినా మంచి పని అయినట్లయితే ఈ యువకులు కొందరు, ఈ బానిసలు కొద్దిమంది మాకన్నా ముందుగా అగ్రగాములయ్యే ప్రసక్తే ఉండేది కాదు అని చెప్పేవారు. ఈ సమాధానం దర్పణంలో ప్రతి వ్యక్తీ స్వయంగానే చూసుకోగలడు–దీన్ని నమ్మేవారి పాత్ర ఎటువంటిదో నమ్మనివారిది ఎలాంటిదో.

23. అంటే, మంచి వ్యక్తుల సత్కార్యాలూ త్యాగాలూ వ్యర్థం కావు, దుష్టులకు వారు చేసిన వాస్తవ దౌష్ట్యానికి మించిన శిక్షా విధించబడదు. సజ్జనుడు తన ప్రతిఫలానికి వంచితుడయినా, లేదా తన వాస్తవహక్కు కన్నా తక్కువ ప్రతిఫలం పొందినా అదీ ఒక అన్యాయమే. అలాగే చెడ్డ వ్యక్తి తాను చేసిన చేష్టల శిక్షను పొందకపోయినా లేదా తాను చేసిన తప్పిదానికి మించి అధికంగా శిక్ష పొందినా అదీ అన్యాయమే.

24. పరాభవ శిక్ష వారు ప్రదర్శించిన అహంకారానికి తగినట్టుగా అన్నమాట. వారు తమ్ము తాము గొప్పవారుగా భావించేవారు. దైవ సందేశహరుని విశ్వసించి నిరుపేదలు, నిర్భాగ్యులు అయిన విశ్వాసుల వర్గంలో చేరిపోవడం తమ హోదాకు తగని పనిగా వారు భావించేవారు. వారు దురభిప్రాయానికి లోనయి ఉండే వారు, కొందరు బానిసలు, నిర్ధనులయిన మానవులూ విశ్వసించిన దాన్ని తమ వంటి పెద్ద మనుషులు కూడా నమ్మినట్లయితే తమ గౌరవానికి మచ్చ అంటుకుంటుందని వారనుకునేవారు. అందువల్ల పరమ ప్రభువు అల్లాహ్ వారిని పరలోకంలో కడు హీనంగా పరాభవంపాలు చేస్తాడు, వారి అహంకారాన్ని మట్టి పాలు జేస్తాడు.

అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడు అల్లాహ్ పేరుతో

# సహీహ్ బుఖారీ (6వ సంపుటం)

ఉర్దూ అనువాదం: అల్లామా వహీదుజ్జమా౯ (ర.అలై)
తెలుగు అనువాదం : ముహమ్మద్ అజీజుర్రహ్మాన్

كِتَابُ الْمَغَازِي

## 4. యుద్ధాల ప్రకరణం -2
(కితాబుల్ మగాజీ)

# ప్రవక్త మహనీయులు (సఅసమ్) పరమపదించినప్పుడు

**308)** హజ్రత్ ఆయిషా(ర.అ) తెలిపారు: ప్రవక్త మహనీయులు(సఅసమ్) పరమపదించినప్పుడు అబూబక్ర్(రజి) గుర్రంపై స్వారీ అయి తన నివాస గృహం ఉన్న 'సునహ్'[1] నుండి వచ్చారు. గుర్రం నుండి దిగి మస్జిద్‌లో ప్రవేశించారు. అక్కడున్న జనులెవరితోనూ మాట్లాడకుండా సరాసరి నా కుటీరంలోనికి వచ్చారు. దైవప్రవక్త(స) పార్థివ శరీరం వద్దకు వెళ్ళి, ఆయనపై కప్పబడి ఉన్న యమన్ దుప్పటిని తొలగించి ఆయనపై పడి దుఃఖంతో విలపించారు. ఆయన్ని ముద్దాడారు. 'నా తల్లిదండ్రుల్ని మీకు అర్పింతు. అల్లాహ్ మీకు మరోసారి మరణం వొసగడు.[2] అల్లాహ్ మీకు రాసిపెట్టిన ఒక మరణం మీకు సంభవించింది' అని పలికారు.

జుహ్రీ ఇలా అన్నారు: అబూ సలమా నాతో అబ్బాస్ బిన్ అబ్బాస్(రజి) గారి ఉల్లేఖనాన్ని ఇలా ఉటంకించారు– అబూబక్ర్(రజి) దైవప్రవక్త(స) భౌతిక కాయాన్ని సందర్శించి, అక్కడి నుండి బయటకు వచ్చారు. ఆ సమయంలో హజ్రత్ ఉమర్(రజి) జనులతో మాట్లాడుతున్నారు– (దైవప్రవక్త–సఅసమ్– మరణించ లేదని అంటున్నారు).[3] 'మీరు కాస్త ప్రశాంతంగా కూర్చోండి' అని అబూబక్ర్(రజి) ఆయన్ని ఓదార్చారు. కాని ఆయన ఎంతకీ లక్ష్యపెట్టలేదు. జనులు అబూబక్ర్ (రజి) చుట్టూ చేరారు.

అబూబక్ర్ (రజి) ఇలా ప్రసంగించారు: 'ప్రజలారా! (నేను చెప్పేది వినండి). అమ్మాబాద్! మీలో ఎవరయినా ముహమ్మద్(స)ను పూజించేవాడైతే (అంటే దేవుని మాదిరిగా ముహమ్మద్–సఅసమ్– కూడా సదా జీవించి ఉంటారని నమ్మేవాడైతే) ముహమ్మద్(సఅసమ్) మరణించారని తెలుసుకోవాలి. మరెవరయితే అల్లాహ్‌ను ఆరాధిస్తున్నారో, అల్లాహ్ సదా శాశ్వతంగా జీవించి ఉంటాడన్న సంగతిని తెలుసుకోవాలి. ఆయనకు మరణం అన్నది లేదు. అల్లాహ్ స్వయంగా ఖుర్ఆన్‌లో ఇలా సెలవిచ్చాడు–

"ముహమ్మద్ ఒక ప్రవక్త తప్ప[4] మరేమీ కాదు. అతనికి పూర్వం కూడా ఎందరో ప్రవక్తలు గతించారు. అలాంటప్పుడు ఒకవేళ అతను మరణిస్తే లేక హత్య చెయ్యబడితే మీరు వెనుకంజ వేసి మరలిపోతారా? జ్ఞాపకం ఉంచుకోండి, మరలి పోయేవాడు అల్లాహ్‌కు ఏమాత్రం నష్టం కలిగించలేడు. కాని అల్లాహ్‌కు కృతజ్ఞత చూపే దాసులుగా జీవించే వారిని ఆయన తగువిధంగా బహూకరిస్తాడు."

*(ఆలి ఇమ్రాన్– 144)*

ఇబ్నె అబ్బాస్(రజి) ఇలా అన్నారు: అబూబక్ర్(రజి) ఈ ఆయత్‌ను పఠించి వినిపించినప్పుడు, జనులు అల్లాహ్ ఈ ఆయత్‌ను అప్పుడే అవతరింపజేసినట్లుగా– ఆశ్చర్యచకితులై– విన్నారు. తరువాత వారు అబూబక్ర్(రజి) నుండి ఈ ఆయత్‌ను (అనేకమార్లు) విని దానిని కంఠస్థం చేసుకున్నారు. ఎవరి నోట విన్నా ఈ ఆయతే. ... హజ్రత్ ఉమర్ (రజి) ఇలా అనేవారు: నేను ఆ ఆయత్‌ను (అంతకుముందు ఎన్నడూ) వినలేదనిపించింది నాకు. అబూబక్ర్ (రజి) నోట ఈ ఆయత్‌ను వినగానే నేను మెత్తబడిపోయాను. (నా ఆవేశం కాస్తా చల్లారింది). భయం చేత నా కాళ్ళు లేవలేదు. నేను ఒక్కసారిగా నేలకొరిగాను. అబూబక్ర్ నోట ఈ ఆయత్‌ను విన్నంతనే, దైవప్రవక్త(స) నిజంగా మరణించారన్న విషయాన్ని నేను అర్థం చేసుకున్నాను.

308-1. 'సునహ్' అనేది మదీనా పురమునకు కాస్త దూరంగా ఎత్తయిన ప్రదేశంలో ఉన్న ఒక వాడ. అక్కడ బనీ హారిస్ బిన్ ఖజ్రజ్ ప్రజలు నివసించేవారు.

308-2. అబూబక్ర్(రజి) ఈ విధంగా పలికి, మహాప్రవక్త(స) మళ్ళీ బ్రతుకుతారని, కపటుల కాళ్ళు చేతుల్ని నరుకుతారని నమ్మే సహచరుల భావనను ఖండించారు.

308-3. అంటే- దైవప్రవక్త(సఅసమ్) ఇంకా చేయవలసిన పను లున్నాయి. ద్వంద్వనీతి పరులను శిక్షించనంత వరకూ ఆయన(స)కు మరణం రాదు అని చెప్పదలిచారు.

వేరొక ఉల్లేఖనంలో ఇలా వుంది: "ఖబడ్దార్! దైవప్రవక్త(స) చనిపోయారని చెప్పేవాని మెడను ఖడ్గంతో నరికేస్తాను" అని హజ్రత్ ఉమర్(రజి) హెచ్చరించారు- అంటే ఆయన(స)కు మరణం సంభవించలేదని ఉమర్ గట్టిగా నమ్మారు లేదా ఆయన అలా అనటంలో ఏదో గొప్ప పరమార్థం దాగి ఉండవచ్చు! ఖిలాఫత్ వ్యవహారం ఓ కొలిక్కి రానంతవరకూ దైవప్రవక్త(స) మరణ వార్తను ప్రకటించరాదన్నది ఆయన ఉద్దేశ్యమై ఉండవచ్చు. ఎందుకంటే ప్రవక్త(స) మరణవార్తను విన్న కొందరు అవకాశవాదులు వ్యవస్థను ఛిన్నాభిన్నం చేసే ప్రయత్నం చేయవచ్చు.

308-4. అంటే ఆయన కేవలం ఒక ప్రవక్త మాత్రమే. ఆయన(స) దైవం గానీ, దైవానికి భాగస్వామి గానీ, దేవుని కుమారుడు గానీ కారు.

# దౌర్జన్యపరుడు వట్టి మూర్ఖుడు

నసీరా బేగం

**ఒక** దేశాధినేత గనక న్యాయ పరిపాలన చేసినట్లయితే ఆ దేశం మొత్తం న్యాయ పరిమళంతో గుబాళిస్తుంది. అక్కడి ప్రజలందరూ న్యాయాన్ని అలవరచుకుంటారు. ఆ అధినేతను ఇష్టపడతారు. అతని అడుగు జాడల్లో నడుస్తూ న్యాయాన్ని రక్షిస్తారు. న్యాయాధి కారిని కూడా రక్షిస్తారు. ఒకవేళ ఆ రాజ్యాధినేత అన్యాయపు పాఠాలను గనక బోధిస్తే, దానిపై బలవంతంగా ఆచరింపజేస్తే ప్రజలు ఆ బలవంతాన్ని కొంతవరకు సహిస్తారు. అతని ఆజ్ఞలను కొంతవరకు ఆచరిస్తారు. కాని ఆ తరువాత బహుకొద్దికాలంలోనే తిరుగుబాటు మొదలు పెడతారు. ఆ దేశాధినేతకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తారు. అతని నిజరూపాన్ని ప్రజల ముందు బహిరంగ పరుస్తారు. అతన్ని గద్దె దించుతారు. ఇది అనాది నుంచీ జరుగుతూ ఉన్న విషయం. ఎందుకంటే అన్యాయాన్ని ఏ వ్యక్తి మనస్సాక్షీ అంగీకరించదు. ఇతరులపై అన్యాయం జరగటాన్ని కూడా అది సహించదు. ఒకవేళ ఏ వ్యక్తి అయినా అన్యాయాన్ని చూసి కూడా చలించకపోతే అతనిలో ఒక మంచి మనసు లేదన్నమాట వాస్తవం. అన్యాయాన్ని ఎదిరించటం మనిషి బాల్యం నుంచే నేర్చుకుం టాడు. ఎదిరిస్తాడు. తనను తాను రక్షించుకుంటాడు. ఇతరులను కూడా రక్షిస్తాడు. ఇది అతని నైజం.

అన్యాయం, దౌర్జన్యం ఎవరి మీద ఎవరు చేసినా అతను చేసినంత కర్మఫలితం అనుభవించక తప్పదు. మొట్టమొదట అతను మనశ్శాంతిని కోల్పోతాడు. కంటి నిండా నిద్రకు దూరమైపోతాడు. నిద్ర లేచినా, పడుకున్నా అతను చేసిన దౌర్జన్యం అతన్ని వెంటాడు తూనే ఉంటుంది. అతన్ని పిచ్చివానిగా చేసేస్తుంది. చివరకు అతనికి ప్రాణహాని భయం కూడా పట్టుకుంటుంది. ఎల్లప్పుడూ అతని రక్షకులు అతని వెంట ఉండవలసి ఉంటుంది. ఒకవేళ న్యాయ పరిపాలకుడు ఉంటే అతని మనసు సుఖసంతోషాలతో నిండిపోయి ఉంటుంది. అతని హృదయం ప్రశాంతతతో అలరారుతూ ఉంటుంది. అతనిలో ఎలాంటి భయాందోళనలు ఉండవు. కనుక అతని వెంట అతని రక్షకుల అవసరం కూడా అతనికి ఎంతమాత్రం ఉండదు. అతను న్యాయపు ద్వారాలు తెరచి ఉంచటం వల్ల అతని కోసం అన్నివేళలా ఇతర దేశాల ద్వారాలు సైతం తెరచి ఉంటాయి. అతను తాను కోరిన చోటికి వెళ్ళగలడు. ప్రపంచమంతా హాయిగా తిరిగి రాగలడు.

దౌర్జన్యపరుడు పైకి చాలా బలవంతుడిగా కనిపిస్తాడు. దౌర్జన్యానికి గురైనవాడు బలహీనునిగా కనిపిస్తాడు. కాని దౌర్జన్యపరుని దౌర్జన్యం, అతనిలో ఉన్న శక్తి, దౌర్జన్యానికి గురైనవాని బలహీనత అతని నిస్సహాయత తాత్కాలికమైనది. ఎందుకంటే ఇద్దరి ఫలితం భిన్నంగా ఉంటుంది. దౌర్జన్యపరుడు తప్పకుండా బలహీనపడ తాడు. చివరకు తన దౌర్జన్యానికి శిక్ష అనుభవిస్తాడు. దౌర్జన్యానికి గురైన వ్యక్తికి దైవ సహాయం లభిస్తుంది. అతనికి శక్తిసామర్థ్యాలు లభిస్తాయి. అతని సహనానికి ప్రతిఫలం లభిస్తుంది. ఎందుకంటే దేవుడు అత్యంత కృపాశీలుడు, కరుణామయుడు. ఆయన సర్వశక్తిమంతుడు అయినప్పటికీ ప్రజలపై దౌర్జన్యం ఎన్నటికీ చెయ్యడు. ప్రజలు చేసే దౌర్జన్యాన్ని కూడా ఆయన సహించడు. కనుక బహుకొద్దికాలంలోనే అతన్ని పట్టుకుంటాడు. అతను ఎంత గిలగిలా కొట్టుకున్నా ఆయన అతన్ని వదిలిపెట్టడు. కనుకనే

ఆయన దౌర్జన్యపరుడి త్రాడును వదులుతూ ఉంటాడు. ఎందుకంటే అతను వెనక్కి తిరిగి వస్తాడేమో చూద్దామని. ఇది అతనికి మంచి అవకాశం. కాని, ఆ దురదృష్టవంతుడు ఆ అవకాశాన్ని అతను తనను పట్టించుకునేవాడు, శిక్షించేవాడూ ఎవడూ లేడు అనీ, నా ఇష్టానుసారంగా నేను చెయ్యగలను అనీ దౌర్జన్యంలో ఇంకా ఇంకా ముందుకే వెళ్తూ ఉంటే చివరకు అల్లాహ్ ఆ త్రాడునే పట్టుకుని గట్టిగా లాగుతాడు. చివరకు అతను బోర్లాపడిపోవటం తప్ప మరేమీ ఉండదు.

చరిత్రలో ఫిరౌన్ రాజు, నమ్రూద్ రాజు, షద్దాద్, హామాన్ జీవిత చరిత్రలు ఎలుగెత్తి ఈ విషయం గురించి సాక్ష్యమిస్తూ ఉన్నాయి. ఈ దౌర్జన్యపరులకు దేవుని తరఫు నుంచి అవకాశం సమయం ఏళ్ళ తరబడి లభించినా హితబోధను స్వీకరించే అదృష్టం వారికి లభించలేదు. చివరకు దేవుడు వారి కోసం శిక్షా సమయాన్ని నిర్ణయించి పట్టుకున్నప్పుడు ఊపిరి పీల్చుకోవటానికి వారికి ఒక్క నిమిషం సమయం కూడా ఆయన ఇవ్వలేదు. వారు పడిన పశ్చాత్తాపానికి ఎలాంటి అంగీకారమూ లభించలేదు. వారు పెట్టిన ఆర్తనాదాలకు ఎలాంటి సహాయం వారి వద్దకు పంపబడలేదు. చివరకు దౌర్జన్యపరుల జీవితాలు రాబోయే తరాల వారికి గుణపాఠాలుగా మిగిలిపోయాయి. ఇహలోకంలో తీవ్ర అవమానం, పరలోకంలో కఠినశిక్ష వారికి పెద్ద బహుమతిగా లభించింది. వారికి వారి వద్ద శకిసామర్థ్యాలు ఉన్నప్పటికీ వారి వద్ద శిక్షణలో ఆరితేరిన సైనికులు ఉన్నప్పటికీ వారి వజ్రవైఢూర్యాలు, వారి ధనరాశులు ఏమీ వారికి పనికిరాకుండా పోయాయి.

దౌర్జన్యానికి గురైన ప్రజల సహాయానికి దేవుడు దిగినట్లయితే దౌర్జన్యపరుడికి నిలువ నీడ ఉండదు. వలసపోయే ప్రాంతమూ ఉండదు. అతని కొరకు భూమి కుంచించుకుపోతుంది. ఆకాశం అతన్ని అణచివేస్తుంది. భూమి ద్వారాలన్నీ మూసుకుపోతాయి. అన్నివైపుల నుంచి అగౌరవం తప్ప మరేమీ లభించదు. ఎందుకంటే దౌర్జన్యానికి గురైన వారికి, అల్లాహ్‌కు మధ్యన ఎలాంటి పరదా ఉండదు. వారి ఆర్తనాదాలు నేరుగా అల్లాహ్‌కు చేరుకుంటాయి. అల్లాహ్ వారికి ఊహించని మార్గాల నుంచి సహాయ సహకారాలు అందిస్తాడు.


దీనిద్వారా తెలిసిన విషయమేమిటంటే మనిషి పరిస్థితులు మారుతూ ఉంటాయి. ఇది జీవిత సత్యం. దీనిని ఎవరూ వ్యతిరేకించలేరు. కాని అజ్ఞాని అయిన మనిషి పరిస్థితులన్నీ తన చేతిలోనే ఉంటాయి అని అనుకుంటాడు. తన తలరాతలు కూడా తానే వ్రాసుకోగలను అని అనుకుంటాడు. ఇలా అనుకుని ఒక భ్రమలో వారు జీవిస్తూ ఉంటారు. ఇలాంటి వారి జీవితం వారి ఇష్టానుసారంగా ఉంటుంది. తాము అనుకున్నదే చేస్తూ పోతూ ఉంటారు. అది మంచిదో చెడ్డదో కూడా ఆలోచించరు. వెనక్కి తిరిగి చూడరు. ఇది వారి మత్తు.

ఒక ధనవంతుడు కొన్నిసార్లు నిస్సహాయుడైపోతాడు. ఒక బలవంతుడు కొన్నిసార్లు బలహీనుడై పోతాడు. ఒక ఆరోగ్య వంతుడు కొన్నిసార్లు అనారోగ్యానికి గురవుతాడు. ఆ అనారోగ్యం నుంచి అతనికి కోలుకునే పరిస్థితి కూడా ఉండదు. ఒక వృక్షపు ఆకు ఎల్లప్పుడూ పచ్చగానే ఉండదు. అది పసుపు పచ్చగా కూడా మారిపోతుంది. చివరకు అది రాలిపోతుంది కూడా. ఇదేవిధంగా దౌర్జన్యపరుడు ఎల్లప్పుడూ దౌర్జన్యపరుడుగానే ఉండజాలడు. కొంత సమయం తరువాత దౌర్జన్యానికి గురైన వ్యక్తి బలవంతుడై పోతాడు. అవకాశాలు కూడా అతనికి అనుకూలంగా తయారవు తాయి. అప్పుడు దౌర్జన్యపరుడిని అణచివేసే ఒక పెద్ద అవకాశం అతనికి చేజిక్కుతుంది.

దౌర్జన్యపరుడు ఎల్లప్పుడూ తనను తాను గొప్ప తెలివైన వ్యక్తిగా భావిస్తూ ఉంటాడు. కాని వాస్తవం ఏమిటంటే అతను ఒక పెద్ద మూర్ఖుడు తప్ప మరేమీ కాడు. ఎందుకంటే అతని దృష్టి రాబోయే పరిణామంపై ఉండదు. అతను పరాభవం పాలు అవుతూ ఉన్న విషయాలు స్పష్టంగా అతని ముందుకు వస్తూ ఉన్నా నిజమైన దృష్టితో వాటిని చూసే ప్రయత్నం కూడా చెయ్యడు. ఎందుకంటే పరాభవం అనే పదాన్నే అతను స్వయాన అతని నిఘంటువులో నుంచి ఎప్పుడో తుడిచి పెట్టేసి ఉంటాడు. పైగా అతను ఎదుర్కొంటున్న పరాజయాన్ని విజయం అనే పదంతో మార్చుకుంటూ ఉంటాడు. దౌర్జన్యపు మదం అతని తలలో ఎంతగా పేరుకుని ఉంటుందంటే అతన్ని అవమానం పాలు చేసే, పరాజయం పాలు చేసే చిన్న చిన్న విషయాలు సైతం అతని దృష్టిలో ఉండవు.

ఉదాహరణకు ఆదమ్(అ) సంతానమైన ఖాబీల్ తన సోదరుడైన హాబీల్‌ను హత్య చేశాడు. హాబీల్ మరణించాడు. కాని హాబీల్‌ను ఎక్కడ, ఎలా దాచిపెట్టాలో అతనికి తెలియలేదు. అప్పుడు అల్లాహ్ అతని ముందుకు ఒక కాకిని పంపాడు. ఆ కాకి తన సోదరుడైన మరొక మృత కాకిని భూమిని తవ్వి పాతిపెట్టింది. ఈ దృశ్యాన్ని చూసి అతను "అయ్యో నేను పాడుగాను! నాకు ఈ కాకికి ఉన్న తెలివితేటలు కూడా లేకుండాపోయాయే" అని వాపోయాడు. కాని లాభం ఏమిటి?

కథ



# ఆస్తులు - ఆత్మీయతలు

- షహనాజ్ బేగం, అనంతపురం

**ఆ రోజు** నా మిత్రుడు నవాజ్ ఇంట్లో ఏదో శుభకార్యం ఉందంటే వాళ్ళింటికి వెళ్ళాను. అప్పటికే అక్కడికి నవాజ్ కుటుంబ సభ్యులందరూ అంటే అతని అన్నాదమ్ముళ్లు, అక్కాచెల్లెళ్లు, కొడుకులు, కోడళ్ళు, కూతుళ్ళు, అల్లుళ్ళు- వారి పిల్లలు వచ్చి ఉన్నారు. అక్కడంతా ఆనందం వెల్లివిరిస్తోంది. నవ్వుల జల్లులు కురుస్తున్నాయి. అక్కడ ఉన్నవాళ్ళందరూ ఒకరినొకరు ఆప్యాయంగా, ఆత్మీయంగా పలకరించుకుంటూ ఉన్నారు. వాళ్ళ నడుమ ఎలాంటి కల్మషాలు, విభేదాలు లేనట్టు మసలుకుంటు న్నారు.

నాకు వాళ్ళందరి ప్రేమాభిమానాలను చూస్తుంటే ఓ ప్రక్క మహానందంగా ఉన్నా మరో పక్క నా కుటుంబసభ్యుల నడుమ గల విభేదాలు, వారి ప్రవర్తన గుర్తుకొచ్చి బాధ అనిపించింది.

నా కొడుకు, కూతురు నడుమ మాటల్లేవు. వాళ్ళిద్దరూ ఒకర్నొకరు పలకరించుకోక సంవత్సరాలు గడిచిపోతున్నాయి. వాళ్ళిద్దరూ ధార్మిక వచనాలు కూడా మరచిపోయారు. కారణం ఆస్తి తగాదాలే. తను తన భార్య జీవితాంతం కష్టపడి పైసాపైసా జమ చేశారు తమ పిల్లల కోసమంటూ. తీరా ఆస్తి పంపకాలప్పుడు వాళ్ల నడుమ ఘర్షణ మొదలైంది. ఒకర్నొకరు నిందించుకోవటం ప్రారంభించారు.

అది నాది, ఇది నీదంటూ రభస చేశారు. తన కొడుకు ఆర్థికంగా దెబ్బ తినడంతో అతనికి ఎలాంటి ఆర్థిక సంపాదన లేకపోవడంతో ప్రస్తుతం తాము ఉంటున్న ఇంటిని అతని పేర వ్రాస్తానని చెప్పటమే తప్పయిపోయింది కూతురి దృష్టిలో.

అందులో కూడా తనకు భాగం కావాలని, అన్నపై కక్ష సాధింపు చర్యలు మొదలెట్టింది. విభేదాలు ఏర్పడ్డాయి. కన్న తల్లిదండ్రుల పట్ల కూడా ద్వేషం పెంచుకుంది. కన్నవాళ్ళతో మాట్లాడటం కూడా మానేసింది. కన్నవాళ్ళ మమతానురాగాలను మరిచిపోయింది.

నవాజ్ కుటుంబం, అతని సంతానం అలా కాదు. పరస్పరం ప్రేమానురాగాలను పంచుకుంటారు. ఒకరికి కష్టం వస్తే మరొకరు ఆ కష్టాలను పంచుకుంటూ సహాయ సహకారాలను అందిస్తూ ఉంటారు.

నవాజ్ తన పిల్లల కోసమంటూ పెద్దగా ఆస్తిపాస్తులు సంపాదించి పెట్టలేదు. చదువులను చెప్పించాడు. అవే మీ ఆస్తిపాస్తులు అన్నాడు. వాళ్ళు తృప్తిగా జీవిస్తున్నారు. తను లక్షల కొద్దీ ఆస్తులు కూడబెట్టి పంచిపెట్టినా వారికి తృప్తిలేదు. ఎప్పుడూ ఏదో ఒక తగాదా పెట్టుకుంటారు.

అవన్నీ గుర్తుకొచ్చి భారంగా నిట్టూర్చాను.

పూర్వం మా తల్లిదండ్రుల కాలంలో ఇలా జరిగేవా? మా అత్తయ్యలు, చిన్నాన్నలు, మావయ్యలు ఎంత ఐక్యతగా ఉండే వారు!? వాళ్ళందరూ కల్సినచోట అక్కడంతా ఆప్యాయతలు, అనురాగాలు, ఆత్మీయతలు వెల్లివిరిసేవి.

ఆ రోజులే వేరు. ఆనాటి బంధాలు, అనుబంధాలు ఇప్పుడు ఎక్కడున్నాయి. ఈనాటి మానవ సంబంధాలన్నీ ఆర్థిక సంబంధాలు అయిపోయాయి. ఎవరి స్వార్థం వారిది.

ఈ విషయం నిజం చేస్తూ మరో సంఘటన జరిగింది. మా బంధువర్గంలోని ఓ వ్యక్తి చనిపోవటం జరిగింది. కొద్దిరోజులుగా అతను అనారోగ్యంగా ఉన్నాడు. ఏ మందులూ పని చెయ్య లేదట. అతను తన జీవితకాలంలో చాలా సంపాదించి పెట్టాడు. దానికితోడు పెద్దల ఆస్తి కూడా సంక్రమించింది. మంచి

ఆస్తిపరుడు. అతని మరణవార్త విని మేమంతా బయలుదేరి వెళ్ళాము. అంత్యక్రియలకు హాజరై తిరిగి వచ్చాను.

అది జరిగిన మూడో రోజే అతని కుటుంబసభ్యులు ఆస్తిలో వాటా కోసం పెద్దగా కలహించుకున్నారట. ఒకర్నొకరు కొట్టుకోవటం కూడా జరిగిందట.

ఒకే తల్లి కడుపున పుట్టిన సంతానం. ఆస్తుల వాటాల కోసం, ధనం కోసం పోట్లాడుకోవడం ఎంత దయనీయం?

మానవత్వం లోపించటమే దీనికి నిదర్శనం. ప్రాణాలను తీయటానికి కూడా వెనుకంజ వెయ్యటంలేదు. కన్న తల్లులను, తండ్రులను కూడా ఆస్తుల కోసం చంపిన ఉదంతాలను వినవలసి వస్తోంది.

ఒక మనిషి చనిపోయి మూడు రోజులు గడవకముందే ఇలా ఆస్తుల కోసం పోట్లాడుకోవడం మానవతా విలువలను దిగజార్చుకోవడమే కదా!

దానికి ఓ సమయం సందర్భమూ ఉంది. తమ కళ్ళెదుటే ఓ మనిషి చనిపోతే, ఈ లోకంలో ఏదీ శాశ్వతం కాదని, ఎన్ని ఆస్తులు కూడగట్టుకున్నా వాటిని వెంటబెట్టుకుని పోలేమన్న సత్యాన్ని వాళ్ళు తెలుసుకోలేకపోయారు. అందుకే అసహనంగా, అసంతృప్తితో జీవిస్తున్నారు.

ఈ సత్యాన్ని తెలుసుకున్నవాళ్ళు తృప్తిగా, శాంతంగా, ఆ దైవానికి కృతజ్ఞతలను అర్పించుకుంటూ జీవించేస్తున్నారు. తమ ఆస్తులు, అవి తమ హక్కులు అంటూ విర్రవీగుతున్న వీళ్ళు తమ బాధ్యతలను కూడా గుర్తించాలి.

తల్లిదండ్రుల బాగోగులను చూడాలి. వారికి సేవలు చేయాలి. వారి పట్ల గౌరవం కలిగి ఉండాలి.

పెంపకంలో కూడా ఏదో లోపం ఉంటుందేమోననే సందేహం కలగసాగింది.

జీవితాంతం మా ధ్యాసంతా ఆస్తులను పెంపొందించుకునే దిశలోనే సాగిపోయింది. స్థలాలను, ఇళ్ళను కొని సమకూర్చుకునే దాంట్లోనే మా జీవితాలు గడిచిపోయాయి. మా అడుగు జాడల్లోనే మా పిల్లలు కూడా ఏమో!

నా పిల్లలకు మంచి బుద్ధి కలగాలని, మానవతా విలువలు కలిగి ఉండాలని, నా పిల్లలే కాదు, ఇతరుల పిల్లలు కూడా పెద్దల పట్ల గౌరవం, భక్తితోపాటు ఆత్మీయతను కలిగి ఉండాలని అన్నదమ్ములు, అక్కాచెల్లెళ్ళు, అన్నాచెల్లెళ్ళ నడుమ ఆత్మీయతను, అనుబంధాన్ని కలిగి ఉండాలని ఆ దైవాన్ని ప్రార్థించుకున్నాను. ❖

# సమయ పాలన




సాధారణంగా ఏ పని అయినా సరే కార్యదీక్ష ఉంటేనే జరుగుతుంది. 'రాసిపెట్టి ఉంది కనుక అలా జరిగింది' అనడం సరైనది కాదు. నిజానికి 'ఒక సంఘటన లేదా పని జరగడానికి మనం అవకాశాలు కల్పించుకోకపోతే అది ఎప్పటికీ జరగనే జరగదు' అని మనం తెలుసుకోవాలి.

ఏదైనా పని లేదా కార్యక్రమం చేయడానికి ఒక నిర్దిష్టమైన ప్రణాళిక లేదా కాలపట్టిక ఏర్పరచుకుంటే అది జరిగే అవకాశాలు పెరుగుతాయి. అందుకు కొన్ని కిటుకులు, మెళకువలు చూద్దాం :

1) నిర్దిష్ట కాలపట్టిక తయారు చేసుకోండి. పనులు గుర్తుండాలంటే వాటిని రాసిపెట్టుకోవడం లేదా సెల్‌ఫోన్‌ల్ సేవ్ చేసి పెట్టుకోవడం సరైన మార్గం.

2) రాసి పెట్టుకున్న తరువాత దాన్ని తరచుగా పరిశీలిస్తూ ఉండాలి. వారం వారం రాసి పెట్టుకున్న పనులలో ముఖ్యమైన వాటిలో ఎన్ని చేశాం? ఎన్ని చేయలేదు? పరిశీలించినట్లయితే చెయ్యవలసిన పనులు తెలిసిపోతాయి.

3) పనులకు ఎక్కువ, తక్కువ కాకుండా ఖచ్చితంగా అంచనా వేసి సమయాన్ని కేటాయించుకోండి. ఎక్కువ టైమ్ పెట్టుకుంటే పనులు మెల్లిగా చేస్తాం. సమయం వృథా అవుతుంది. అలా కాకుండా చూసుకోండి.

4) మీ నైపుణ్యాలు, శక్తిసామర్థ్యాలకు అనుగుణంగా పనిని నిర్ణయించుకోండి. ఉదాహరణకు కొందరు ఉదయం చురుకుగా, సమర్థవంతంగా పనులు చేయగలుగుతారు. మరికొందరు మధ్యాహ్నం ఉత్సాహంగా, హుషారుగా పనులు చేయగలుగుతారు. క్లిష్టమైన పనులు, ఏకాగ్రత, సృజనాత్మకత అవసరమైన పనులన్నీ ఆయా సమయానుకూలంగా కేటాయించుకుంటే మంచిది.

పనులకు నిర్దిష్టమైన కాలపట్టిక తయారు చేసుకుని, తదనుగుణంగా చేస్తే సమయం సద్వినియోగం అవుతుంది. పనులన్నీ అయిపోయిన తరువాత కాలపట్టికను ఒకసారి పరిశీలించి చేసిన, చేయలేకపోయిన పనులు, వాటికి కారణాలు పరిశీలించుకోవాలి. దీనివలన తదుపరి ప్రణాళికను మరింత సమర్థవంతంగా తయారు చేసుకోవచ్చు. ఏమంటారు?!





# గాజా ఘోరం - మౌనంగా చూస్తున్న ప్రపంచం

**- హిబా అర్జుమంద్ ఖాన్**

**ఫలస్తీనా** ప్రాంతం పశ్చిమ ఆసియాలో ఒక చిన్న భూభాగమే అయినా, గత వందేళ్ళుగా ఆ ప్రాంతం మీద జరుగుతున్న అణచివేతలు, ఆక్రమణలు, హత్యాకాండలు ఈ కాలపు మానవతా చరిత్రలో అతి ఘోరమైన అధ్యాయంగా నిలుస్తున్నాయి. ముఖ్యంగా గాజా అనే చిన్న ప్రాంతంలో, దాదాపు 23 లక్షల మంది నివసిస్తున్న చోట, గత రెండు సంవత్సరాలుగా ఇస్రాయీల్ చేస్తున్న హింసాత్మక దాడులు ప్రపంచ మౌనాన్ని ప్రశ్నిస్తున్నాయి. వాస్తవానికి ఇది ఒక యుద్ధం కాదు. ఇది ఓ దమనకాండ. ఇది రెండు దేశాల మధ్య వైరం కాదు, ఒకరి బలహీనత, మరొకరి అరాచకం మధ్య జరుగుతున్న అమానవీయ పోరాటం. కానీ కళ్ళ ముందు ఇంత ఘోరం జరుగుతున్నా ప్రపంచ దేశాలు, ముఖ్యంగా ముస్లిం దేశాలు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నాయి.

గత 75 సంవత్సరాలుగా ఫలస్తీనా ప్రజలు తమ భూమిని కోల్పోయి, తమ ఇల్లు తమదేనని న్యాయబద్ధంగా చెప్పుకునే హక్కును కోల్పోయారు. 1948లో ఏర్పాటు చేసిన ఇస్రాయీల్ అనే దేశానికి తాత్కాలిక ఆశ్రయం ఇచ్చిన ఫలస్తీనీయులు, ఇప్పుడు తాము బతుకుతున్న నేలపై పరాయి వారిగా ముద్ర వేయబడుతున్నారు. ఈ తలకిందుల న్యాయం ఇప్పుడు ఒక అప్రతిహత మానవ హక్కుల సంక్షోభంగా మారింది.

గాజా భూభాగం అంతరాయం లేకుండా బాంబుల వర్షానికి గురవుతోంది.

2025 జూన్, జూలై నెలల్లో గాజాలో జరిగిన దాడులు మరింత అమానవీయంగా మారాయి. ఇటీవల యునెస్కో, వారసత్వ ప్రదేశంగా గుర్తించిన 800 ఏళ్ళ పురాతన మస్జిద్‌ను ఇస్రాయీల్ బాంబులతో దాడిచేసి కూల్చివేసిందని పశ్చిమాసియాకు చెందిన జర్నలిస్టులు వెల్లడించారు. అంతేకాకుండా, ఓయెన్ బీడీ అనే కెనడా ఫోటో జర్నలిస్టు, తన కెమెరాతో శవాలను డాక్యుమెంట్ చేస్తున్న సమయంలో గాజాలో బాంబు దాడిలో మరణించాడు. ఈ ఘటన అంతర్జాతీయ పత్రికా సంఘాల దృష్టిని ఆకర్షించినా, ఐక్యరాజ్యసమితి మినహా మరెవ్వరూ గట్టిగా స్పందించలేదు.

జూలై 18న ఐక్యరాజ్యసమితి విడుదల చేసిన ప్రత్యేక నివేదికలో, గాజాలో జరుగుతున్న మారణహోమం 'జనాభా నిర్మూలనకు చేపట్టిన వినాశకర చర్యలు'గా స్పష్టంగా పేర్కొనడం జరిగింది.

ఆసుపత్రులు, పాఠశాలలు, నివాస భవనాలు అన్నీ లక్ష్యంగా మారుతున్నాయి. 2023 అక్టోబర్ నుండి ఇప్పటి వరకు జరిగిన దాడుల్లో 60,000 మందికి పైగా పౌరులు ప్రాణాలు కోల్పోయినట్లు స్వతంత్ర నివేదికలు వెల్లడిస్తున్నాయి. శవాల మీద బాంబులు పడిన ఘట్టాలు ప్రపంచం ముందు వెలుగులోకి వచ్చినా, ప్రతిసారీ మౌనమే రాజ్యమేలుతోంది. ఈ దాడుల్లో

చిన్నపిల్లలు, మహిళలు, వృద్ధులు టార్గెట్ చేయబడుతున్నారని, ఉద్దేశపూర్వకంగా మానవతా విలువల్ని ధ్వంసం చేస్తున్నారని స్పష్టమైన ఆధారాలు ఉన్నాయి.

ఈ పరిస్థితిని కేవలం ఇస్రాయీల్- హమాస్ యుద్ధంగా పేర్కొనడం అసత్యమే అవుతుంది. గాజా ప్రజలు తమ భూమిపై బతికే హక్కును కోరుకుంటున్నారు. శాంతియుత జీవనాన్ని ఆశిస్తున్నారు. కానీ వారి పోరాటాన్ని ఉగ్రవాదంగా చిత్రీకరిస్తూ, ప్రతి నిరసనను అణచివేస్తూ, ప్రతి గ్రామాన్నీ ధ్వంసం చేస్తూ, ఇస్రాయీల్ రాక్షసత్వం కొనసాగుతోంది. గతంలో ఆశ్రయం కోరిన వారు, ఇప్పుడు అధికారం నెరపుతూ, ఆశ్రయం ఇచ్చిన వారిని లేకుండా చేయడానికి బాంబుల మీద బాంబులు వేస్తున్నారు.

ఇది నరమేధం. ఇది మానవతా హననం. కానీ అంతర్జాతీయ సమాజం ఈ విషయంలో చేతులెత్తేసింది. ఐక్యరాజ్యసమితి తీర్మానాలు నిరుపయోగంగా మారాయి. అమెరికా, యూరప్ దేశాలు ఈ దౌష్ట్యానికి బాసటగా నిలుస్తున్నాయి. ఎందుకంటే ఇస్రాయీల్‌తో ఉన్న వ్యాపార ఒప్పందాలు, ఆయుధాల కాంట్రాక్టులు, రాజకీయ లబ్ధి, మానవ జీవితాల కన్నా ముఖ్యం అయిపోయాయి.

ఈ సందర్భంలో అతి తీవ్రంగా గుండెను కలిచే విషయం, ముస్లిం దేశాల మౌనం. ప్రపంచంలో దాదాపు 57 ముస్లిం దేశాలు ఉన్నా, అందులో నుండి ఒక్క స్వరమూ గట్టిగా వినిపిస్తున్న దాఖలా లేదు. కొన్ని దేశాలు అమెరికా ధోరణికే అనుగుణంగా ఉంటూ, మేము శాంతిని కోరుకుంటున్నామని ప్రకటనలు చేస్తున్నాయి. వారు కోరుకుంటున్న ఆ శాంతి ఫలస్తీనా మీద పడే బాంబులను ఆపడంలేదు. ఒఐసీ వంటి సంస్థలు పరిపూర్ణంగా క్రియాశీలకంగా వ్యవహరించలేకపోతున్నాయి. గాజాలో పిల్లలు బాంబుల ధాటికి బూడిదైపోతుంటే, 'ఇస్లామీయ ఉమ్మా' అనే భావన అర్థరహితంగా మారిపోయింది.

ఇలాంటి అణచివేతలు ఉన్నచోట, చట్టాలు మౌనంగా ఉంటే, ఇక మానవ మనుగడకు అర్థం ఏముంటుంది. గాజా ప్రజల ఆవేదన, దుఃఖం, కోపం, ఇవన్నీ చట్టానికి కాకుండా, చరిత్రకు ఆత్మగా నిలుస్తాయి. వారు పోరాడుతున్నారు. తమ జీవించే కనీస

**మానవతా విలువలు పతనమవుతున్నప్పుడు, మౌనం నిష్క్రియ కాదు, భాగస్వామ్యం అవుతుంది. అట్లాంటి సమయంలో, బాధితుల పక్షాన మన స్వరం వినిపించాలి, అది చిన్నదైనా, ఒంటరిదైనా, అల్పమైనదైనా సరే. ఒక్క వాక్యమైనా న్యాయానికి అనుకూలంగా పలికితే, అది మనిషితనానికి ఒక సంతకం అవుతుంది.**

హక్కు కోసం.. కోల్పోతున్న తమ ఇళ్ళను రక్షించుకోవడంకోసం.. కోల్పోయిన భూభాగాలను తిరిగి పొందడంకోసం... మిలిటరీ లేదు. ఎయిర్ ఫోర్స్ లేదు. నౌకలు లేవు. కానీ ధైర్యం ఉంది. తమ పిల్లల కోసం, వారి భవిష్యత్తు కోసం, చిత్తశుద్ధితో వారు బ్రతకడానికి పోరాడుతున్నారు.

ఈ ఘోర సంఘటనలు మానవ హృదయాలను కలచి వేయడం లేదా? మనం మౌనంగా ఉంటే దుర్మార్గాలు సమసిపోతాయా? రాక్షసత్వం మరింతగా పెట్రేగిపోదా? మానవతా విలువలకు తిలోదకాలిచ్చిన ఈ యుగంలో, నైతికతకు చరమగీతం పాడిన ఈ ప్రపంచంలో, కనీసం మాట సాయంగానైనా మన చిత్తశుద్ధిని కాపాడుకుంటూ, బాధితుల పక్షాన నిలబడలేమా? మానవతా విలువలు పతనమవుతున్నప్పుడు, మౌనం నిష్క్రియ కాదు, భాగస్వామ్యం అవుతుంది. అట్లాంటి సమయంలో, బాధితుల పక్షాన మన స్వరం వినిపించాలి, అది చిన్నదైనా, ఒంటరిదైనా, అల్పమైనదైనా సరే. ఒక్క వాక్యమైనా న్యాయానికి అనుకూలంగా పలికితే, అది మనిషితనానికి ఒక సంతకం అవుతుంది. గాజాలో తల్లి కోసం విలపిస్తున్న చిన్నారి కన్నీటి తడి మన గుండెను తడపాలి. మన శ్వాస ఆ నిశ్వాసలో ఓ క్షణమైనా కలవాలి. ఎందుకంటే రేపు చరిత్ర మనవైపు తిరిగి చూసినప్పుడు, మనం ఏ వైపున ఉన్నామన్న ప్రశ్న తప్పక వస్తుంది. అప్పుడు మనం కనీసం న్యాయం పక్షాన, పీడితుల పక్షాన ఉన్నామన్న సంతృప్తితో ఊపిరి పీల్చుకోగలగాలి.

వ్యక్తి సంస్కార, సంఘ నిర్మాణ
నైతిక పథకం
సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక




# కురిసే వర్షం సాక్షిగా!

షేఖ్ అబ్దుల్ బాసిత్,
కొత్తగూడెం

**సకల ప్రాణికోటికి జీవనాధారం నీరు.** చరిత్రను అధ్యయనం చేస్తే మానవ నివాస ప్రాంతాలన్నీ నదీ తీర ప్రాంతాల్లోనే వసింప జేసినట్లు తెలుస్తోంది. నేడు పెద్ద పెద్ద నగరాలు పట్టణాలు అన్నీ నదీ తీరాలలోనే కానవస్తాయి. ఎందుకంటే సకల జీవకోటికి నీరే ఆధారం కనుక.

ఆక్సిజన్, హైడ్రోజన్ వాయువుల కలయిక వల్ల నీరు ఏర్పడుతుంది అని సైన్స్ చెబుతుంది. చిత్రమేమిటంటే, హైడ్రోజన్ ఏమో మండే స్వభావం కలిగినది, ఆక్సిజన్ ఏమో మండటానికి సహాయకారిగా ఉపయోగపడుతుంది. ఇలా రెండు భిన్నమైన వాయువుల కలయికతో మంటను ఆర్పే నీటిగా రూపాంతరం చెందింది. ఇలా అద్భుతంగా సృజించిన సృష్టికర్త ఔన్నత్యాన్ని గుర్తించండి అంటుంది ఇస్లాం.

అంతేకాదు.

మానవాళి మార్గదర్శి ఖురాన్‌లో సృష్టికర్త అయిన అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు

"ఆయనే ఆకాశం నుండి వర్షాన్ని కురిపించాడు. దానిద్వారా సకల వృక్ష జాతులను ఉద్భవింపజేశాడు. ఇంకా పచ్చని పొలాలనూ పచ్చని చెట్లనూ సృష్టించాడు. ఒకదానిపై ఒకటి ఒత్తుగా పెరిగిన గింజలను పండించాడు. ఖర్జూరపు పువ్వుల నుండి బరువుతో వంగిన పండ్ల గుత్తులను సృజించాడు. ఇంకా ద్రాక్ష, జైతూను, దానిమ్మ తోటలను సృష్టించాడు. వాటి పండ్లు ఒకదానినొకటి పోలివుండినప్పటికీ ప్రతిదాని ప్రత్యేకతలు వేర్వేరుగా కూడా ఉంటాయి. ఈ వృక్షాలు పంటకు వచ్చినప్పుడు, వాటికి పండ్లు కాయటం, అవి పండటం- ఈ స్థితిని మీరు కొంచెం ఆలోచనాదృష్టితో గమనించండి. (6: 99)

మరో చోట:

"తన కారుణ్యానికి ముందుగా శుభవార్తలను మోసుకుపోయే వాయువులను పంపేది అల్లాహ్‌యే. తరువాత అవి నీటితో నిండిన మేఘాలను ఎత్తుకునిపోయేటప్పుడు వాటిని నిర్జీవంగా పడివున్న ఏ ప్రదేశం వైపునకైనా కదిలిస్తాడు. అక్కడ వర్షం కురిపించి (ఆ మృత భూమినుండే) రకరకాల పండ్లను వెలికి తీసుకొస్తాడు. చూడండి! ఈ విధంగా మేము మృతులను నిర్జీవ స్థితి నుండి ఉద్భవింపజేస్తాము, బహుశా మీరు దానిని చూసి అయినా గుణపాఠం నేర్చుకుంటారేమో అని. (7:57)

ఇంకో చోట

"ఆకాశం నుండి మీ కోసం నీళ్ళను కురిపించేవాడు ఆయనే. ఆ నీటిని మీరూ తనివితీరా త్రాగుతారు, ఆ నీటివల్ల మీ పశువులకు కూడా మేత మొలుస్తుంది. ఆయన ఆ నీటిద్వారా పొలాలను పండిస్తాడు. జైతూను, ఖర్జూరం, ద్రాక్ష ఇంకా రకరకాల ఇతర పండ్లను పండిస్తాడు. ఆలోచించే వారికి ఇందులో ఒక గొప్ప నిదర్శనం ఉంది". (16:10-11)

ఇస్లాం చెప్పే మూల సూత్రాల్లో ఒకటి పరలోక విశ్వాసం. అంటే ఈ జీవితం శాశ్వతం కాదు.శాశ్వతమైన జీవితం మరణానంతర జీవితం. ఈ జీవితం ఆ జీవితానికి ఒక పరీక్ష. ఇక్కడ మనం చేసే ప్రతి పని వ్రాయబడుతుంది. మరణానంతరం తిరిగి లేపి మనం చేసిన ప్రతి పనికి ప్రతిఫలం ఇవ్వబడుతుంది.

ఇదే విషయాన్ని ఈ ఉదాహరణ ద్వారా అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు.

(మీరు ప్రతి వర్షాకాలంలోనూ చూస్తారు). అల్లాహ్ ఆకాశం నుండి

నీళ్ళను కురిపించాడు. నిర్జీవంగా పడివున్న భూమిలో ఒక్కసారిగా దాని ద్వారా ప్రాణం పోశాడు. నిశ్చయంగా ఇందులో వినేవారికి ఒక నిదర్శనం ఉన్నది.(16:65)

అంటే, మీ కళ్ళు ప్రతి సంవత్సరమూ ఈ దృశ్యాన్ని చూస్తాయి. భూమి బీడుగా పడివున్నది. జీవం ఉన్న సూచనలు ఏ మాత్రమూ లేవు. గడ్డీ గాదం పెరగలేదు. చెట్లూ చేమలూ లేవు. మొక్కలూ మొలకలూ లేవు. పూలూ లేవు. మొగ్గలూ లేవు. పురుగూ పుట్రా లేవు. ఇంతలోనే వర్షరుతువు వచ్చింది. ఒకటి రెండు చినుకులు పడగానే అదే భూమిలో జీవం తొణికిసలాడింది. భూమి పొరలలో అణగివున్న అసంఖ్యాకమైన వేళ్ళు అకస్మాత్తుగా బ్రతికాయి. ప్రతి వేరులో నుండి, పూర్వం కురిసిన వర్షంలో మొలిచి పెరిగి చచ్చిన చెట్లు చేమలే మళ్ళీ బయటపడ్డాయి. ఎండాకాలంలో నామరూపాలు లేకుండా పోయినటువంటి అసంఖ్యాకమయిన భూమిలోని క్రిమికీటకాలు హఠాత్తుగా, పూర్వం కురిసిన వర్షంలో కన్పించినట్లు అదే దర్పంతో ప్రత్యక్షమయ్యాయి. ఇదంతా మీరు జీవితంలో మాటిమాటికీ చూస్తారు. అలాంటప్పుడు అల్లాహ్ సమస్త మానవులను మరణించిన తరువాత మళ్ళీ బ్రతికిస్తాడు అనే విషయాన్ని ప్రవక్త నోట విని మీకు ఆశ్చర్యం కలుగుతోందా!

అంటే ఇదే రీతిలో తిరిగి మిమ్మల్ని లేపి ప్రశ్నించడం తథ్యం అని చెప్పడం జరిగింది.

ఇదే విషయాన్ని ఖురాన్‌లో మరో చోట ఇలా ప్రశ్నిస్తున్నాడు.

“ఓ మానవుడా! పరమదాత అయిన నీ ప్రభువును గురించి ఏ విషయం నిన్ను మోసంలో పడవేసింది? ఆయనే నిన్ను సృష్టించాడు, ఎలాంటి లోపం లేకుండా నిన్ను తీర్చిదిద్దాడు, నిన్ను తగిన రీతిలో పొందికగా రూపొందించాడు. తాను తలచిన ఆకారంలో నిన్ను క్రమబద్ధంగా మలిచాడు.

ఎంత మాత్రం కాదు, (అసలు విషయమేమిటంటే) మీరు శిక్షా ప్రతిఫలాలు లేవని తిరస్కరిస్తున్నారు. కాని మీపై కాపలా దారులు నియమించబడి ఉన్నారు, మీ చర్యలను ఒక కంట కనిపెడుతూ ఉండే గౌరవనీయులైన లేఖకులు మీపై నియ మించబడ్డారు. మీరు చేసే ప్రతి పనీ వారికి తెలుసు.” (82:6-12)

అంటే, ఏ కారణం వల్లనైతే మీరు మోసానికి గురిఅయ్యారో అది సమంజసమైన కారణం కానేకాదు. ప్రపంచంలో మానవుడు చేసే కర్మలకు పరలోకంలో శిక్షా బహుమానాలు అనేవి లేనేలేవు అనే మీ అభిప్రాయం తెలివిమాలిన అభిప్రాయం, నిరాధారమైన ఈ తప్పుడు ఆలోచనే దేవుని విషయంలో మిమ్మల్ని ఏమరుపాటుకు గురి చేసింది, ఆయన చేసే న్యాయం విషయంలో మిమ్మల్ని భయపడకుండా చేసింది. ఇంకా అది నైతిక ప్రవర్తన విషయంలో మిమ్మల్ని బాధ్యతారహితులుగా చేసింది.

“చాలా మంది మేము మరణించి మట్టిలో మట్టై పోయాక, లేదా కాలి బూడిదగా మారిపోయాక తిరిగి బతికించి లేపడం ఎలా సాధ్యం” అని అనుకునే వారికి ఖురాన్‌లో అల్లాహ్ ఇలా సమాధానం చెప్పాడు.

“మీరు ఏమి లేని స్థితిలో మిమ్మల్ని సృజించిన సృష్టికర్తకు తిరిగి లేపడం అనేది పెద్ద కష్టమేమీ కాదు కదా!?”

నిజమే కదా! కాస్త ఆలోచించండి. వర్షం మృత భూమికి ప్రాణం పోసినట్లు ఏమీ లేని మనల్ని అమ్మ గర్భంలో మూడేసి చీకటి పొరల నడుమ సూక్ష్మాతి సూక్ష్మమైన రెండు వీర్య కణాల కలయికతో ఇంత అద్భుతమైన ఆకారంలో మలచి అందులో ఆడ మగ అనే రెండు జాతులుగా సృజించినవాడు, మనకు తెలియకుండానే మరణానికి గురిఅయ్యేలా చేసినవాడు, మరణం తర్వాత తిరిగి లేపడం అనేది అసాధ్యం కాదు అనే విషయాన్ని కాస్త బుర్ర పెట్టి ఆలోచించండి.

రెండోది ఇక్కడ దైవానికి భయపడుతూ సదా మంచివారిగా జీవించే వారికి బహుమానం, దైవాదేశాలను ధిక్కరించి ఈ జీవితమే సర్వస్వం అని భావించి దుష్టులుగా దుర్మార్గులుగా, దౌర్జన్యపరులుగా జీవించే వారికి శిక్ష పడాలా వద్దా?

దేవుడు ఉంటే ఇక్కడే ఎందుకు శిక్షించడు అనేది కొందరి వాదన.

ఇస్లాం చెప్పేది ఏమిటంటే?

ఈ సృష్టిలోని కోటానుకోట్ల జీవరాశులను పరిశీలించండి. అవన్నీ మనిషి లాగే జీవనం సాగిస్తున్నాయి. అందులో కూడా ఆడ మగ అనే రెండు జాతులు ఉన్నాయి. అవన్నీ ఒక చట్టానికి లోబడి తమ మనుగడ సాగిస్తున్నాయి. ప్రత్యక్షంగానో పరోక్షంగానో మానవ సేవలో నిమగ్నమై ఉన్నాయి. మానవులకు మాత్రమే మంచీ చెడుల విచక్షణా జ్ఞానం ఇచ్చి తన ఇష్టం వచ్చినట్లు జీవించే స్వేచ్ఛ ఇవ్వడం జరిగింది. ఎందుకంటే పరీక్ష కోసం. ఇచ్చిన జీవిత గడువులో ఎలా జీవిస్తారో చూడాలని.

ఎవరైతే ఈ సృష్టికి సృష్టికర్త ఉన్నాడని నమ్మి మంచి వారిగా జీవిస్తారో వారు శాశ్వతంగా స్వర్గంలో ఉంటారు. ఎవరైతే ఇచ్చిన స్వేచ్ఛను దుర్వినియోగం చేస్తూ ఈ అధికారం, హెూదా, ఆస్తులు అంతస్తులు శాశ్వతం అని, విచ్చలవిడిగా జీవిస్తే పరలోక శాశ్వత జీవితంలో నరకాగ్ని శిక్ష అనుభవించవలసి ఉంటుంది.

అవిశ్వాసులు తాము మరణించిన పిదప మళ్లీ లేపబడటం అనేది ఎంత మాత్రం జరగదు అని పెద్ద సవాలు విసిరారు. వారితో ఇలా అను, “కాదు, నా ప్రభువు సాక్షిగా! మీరు తప్ప కుండా లేపబడతారు. తరువాత, మీరు (ప్రపంచంలో) ఏమేమి చేశారో అదంతా మీకు తప్పకుండా తెలియజేయటం జరుగు తుంది. ఇలా చేయటం అల్లాహ్‌కు చాలా సులభం.” (64:7)




## సయ్యిద్ అబ్దుస్సలామ్ ఉమ్రీ

గత సంచిక తరువాయి

### రోగిని నమాజుకై ప్రోత్సహించటం

అబూహురైరా (రజి) కథనం: "ఒకసారి నేను కడుపునొప్పి బాధతో ఉన్నానని తెలిసి దైవప్రవక్త (స) నన్ను పరామర్శించడానికి వచ్చారు. ఆయన నన్ను చూసి "అబూహురైరా! నీకు కడుపులో నొప్పిగా ఉందా?" అని అడిగారు. నేను 'అవును దైవప్రవక్తా!' అన్నాను. అప్పుడాయన "లే. లేచి నమాజ్ చెయ్యి, నమాజ్‌లో స్వస్థత ఉంది" అని చెప్పారు. (ఇబ్నెమాజ)

దైవప్రవక్త (స) హజ్రత్ అబూహురైనా (రజి)తో ఇలా అన్నారు : "నీకు కలిగే ఏదైనా ఆపద, బాధ లేక విచారం పోవటానికి నమాజ్ చెయ్యి. నమాజ్‌లో స్వస్థత ఉంది. కరుణామయుడైన దేవుడు నీ బాధల్ని దూరం చేస్తాడు".

### దైవప్రవక్త (స) కళ్ళ వెంట అశ్రుధారలు

హజ్రత్ అబ్దుల్లా బిన్ ఉమర్ (రజి) ఉల్లేఖనం : పరామర్శకు సంబంధించి దైవప్రవక్త (స)కు ఎదురైన ఒక సంఘటన ఇలా ఉంది. ఒకసారి సయీద్ బిన్ ఉబాదా (రజి) జబ్బు పడినప్పుడు దైవప్రవక్త(స) ఆయన్ని పరామర్శించడానికి వచ్చారు. అప్పుడు ఆయన (స) వెంట అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్, సాద్ బిన్ అబీ వక్కాస్, అబ్దుల్లా బిన్ మసూద్ (రజి) ఉన్నారు. దైవప్రవక్త (స) సయీద్ బిన్ ఉబాదా దగ్గరకు చేరుకున్నప్పుడు సయీద్ స్పృహలో లేరు. దైవప్రవక్త (స) ఆ దృశ్యం చూసి "అతను చనిపోయాడా?" అని అడిగితే, లేదని తెలిపారు అక్కడున్నవారు. ఆ సమయంలో దైవప్రవక్త (స)పై విషాదఛాయలు అలుముకున్నాయి. తరువాత ఉల్లేఖకులు ఇలా తెలిపారు- దైవప్రవక్త (స)ను ఆ స్థితిలో చూసినవారు కూడా రోదించసాగారు. తరువాత దైవప్రవక్త (స) ఇలా తెలిపారు- "అశ్రువులపై, హృదయావేదనలపై దేవుడు ఎలాంటి శిక్ష విధించడని మీరు వినలేదా? కాని (నాలుక వైపు చూపిస్తూ) దీనిద్వారా శిక్షిస్తాడు లేదా కరుణిస్తాడు" అని అన్నారు. (బుఖారీ, ముస్లిమ్)

### పరామర్శ వేళ చేయాల్సిన దుఆలు

హజ్రత్ అయిసా సిద్దీఖా (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (స)

రోగిని పరామర్శించటానికి వెళ్ళినప్పుడు ఆయన అక్కడ ఈ దుఆ పఠించేవారు: “మానవుల సృష్టికర్తా! ఇతని బాధ దూరం చెయ్యి, ఎలాంటి వ్యాధీ మిగులకుండా పూర్తిగా స్వస్థత చేకూర్చు. (బుఖారీ)

## దుఆ చేయమని రోగిని అభ్యర్థించడం

దైవప్రవక్త (స) హితోక్తి: “మీరు రోగిని పరామర్శించండి. మీ కోసం దేవుణ్ని ప్రార్థించమని చెప్పండి. వ్యాధి గ్రస్తుడి దుఆ చాలా ప్రభావవంతంగా ఉంటుంది, అతని పాపాలు మన్నించబడతాయి.”

దైవప్రవక్త (స) హితోక్తి: “మీలో ఎవరైనా రోగి వద్దకు వెళ్ళినప్పుడు మీ కోసం దుఆ చేయమని అతడ్ని అర్థించండి. అతని దుఆ దైవదూతల దుఆకు సమానంగా ఉంటుంది”. (ఇబ్నెమాజ, మిష్కాత్)

## అంతిమ ఘడియల్లో గుర్తు చేయవలసిన మాటలు

అబూ సయీద్ ఖుద్రీ (రజి) ప్రకారం ప్రవక్త (స) హితోక్తి: “మీలో మరణించేవానికి 'లా ఇలాహ ఇల్లల్లాహ్' పఠించమని గుర్తు చేయండి” (ముస్లిం)

మరో హదీసు ప్రకారం దైవప్రవక్త (స) హితోక్తి: “మీలో ఎవరి చివరి వచనాలు 'లా ఇలాహ ఇల్లల్లాహ్' అవుతాయో వారు స్వర్గప్రవేశం చేస్తారు.” (ముస్తదరక్ హాకిమ్. సుననె అబూదావూద్)

రోగికి అంతిమ ఘడియలు సమీపించాయని అనుకున్నప్పుడు రోగి చుట్టూ చేరినవారు “కలిమయె తయ్యిబా” పఠించమని గుర్తు చేయాలి. గుర్తు చేయటమంటే రోగి దగ్గర కూర్చున్నవారు బిగ్గరగా 'కలిమా' పఠిస్తుండాలి.

ఒకవేళ వ్యాధిగ్రస్తుణ్ణి కలిమా పఠించమంటే అతని మనసు అతని అదుపాజ్ఞల్లో ఉందో లేదో మనకు తెలియదు. అలాంటి స్థితిలో అతను కలిమా పఠించటానికి నిరాకరించవచ్చు. అంచేత అతని దగ్గర కూర్చున్నవారే కలిమా పఠిస్తే రోగి దీన్ని గ్రహించి తానూ 'కలిమా' పఠించడానికి ప్రయత్నించవచ్చు.

## దైవప్రవక్త (స) పరలోక ప్రస్థానం

హజ్రత్ అయిషా సిద్దీఖా(రజి) కథనం: “దైవప్రవక్త (స)కు అంతిమ ఘడియలు సమీపించినప్పుడు ఆయన వద్ద ఒక నీటి పాత్ర ఉంది. అందులో నీళ్ళున్నాయి. ఆయన తన చేతిని ఆ పాత్రలో ముంచి ఆ తడిచేత్తో తన ముఖంపై రుద్దుకునేవారు. తరువాత ఆయన “దేవా! నాకు సహాయం చేయి-మృత్యువు నుంచి, దాని బాధల నుంచి” అని వేడుకునేవారు. (తిర్మిజి షరీఫ్)

హజ్రత్ అయిషా (రజి) కథనం: “దైవప్రవక్త నన్ను ఊతగా చేసుకొని కూర్చొని మాటలు పలకటం విన్నాను- “దేవా! నన్ను క్షమించు. నాపై కరుణించు, నన్ను నా పరమోన్నత మిత్రునితో కలుపు” అని ఆయన వేడుకున్నారు. (ముత్తఫఖున్ అలై)

## రోగుల్ని పరామర్శించటంలో కుల, మత, వర్గ భేదాలు పాటించరాదు

దైవప్రవక్త(స) తను స్వయంగా వ్యాధిగుస్తుల్ని పరామర్శించటమే గాకుండా (దాని కోసం ఇతరుల్ని కూడా పురికొల్పేవారు). పైగా బహుదైవారాధకులు, యూదులు, కపట విశ్వాసులు మొదలగు ముస్లిమేతరులు వ్యాధిగ్రస్తులయినప్పుడు దైవప్రవక్త (సల్లం) వారి దగ్గరకు వెళ్ళి వారిని కూడా పరామర్శిస్తూ ఉండేవారు.


**చందాదారులకు విజ్ఞప్తి**

చాలామంది పాఠకులు తమ చందా సొమ్మును బ్యాంక్ ఆన్‌లైన్ ద్వారా చెల్లిస్తున్నారు. ఇలా చందా చెల్లించిన వారు తమ పూర్తి అడ్రసు, ఫోన్ నెంబరు లేదా సెల్ నెంబరుతో సహా ఉత్తరం ద్వారా గానీ లేదా ఫోన్ ద్వారా గానీ తెలియజేయాలని మనవి.

వివరాలకు ఈ నెంబరుకు ఫోన్ చేయండి 9704317015

**Geeturai Weekly**
**Account No:1042789768**
Bank: **Central Bank of India**
Noorkhan Bazar Branch,
**IFSC Code. CBIN0282407**
Hyderabad- 500 002, Telangana

Office Address: **Geeturai Weekly**
**Sandesha Bhavanam, Lakkadkot, Chatta Bazar**
**Hyderabad-02. Email:geeturaiweekly@gmail.com**




**- షేక్ హసన్ సాహెబ్**

**ప్రపంచం** వేగంగా అభివృద్ధి చెందుతున్న విధానం చూస్తే, సామాన్య మనిషి కూడా ఆ అభివృద్ధిలో భాగస్వామి కావడం తథ్యం. మనిషి జీవనశైలి, ఆచార వ్యవహారాలలో ఎంతో పురోభివృద్ధి సాధించాడు. నిన్నటివరకు సైకిల్ పెడల్ తొక్కుతూ ప్రయాణించిన మనిషి ఇప్పుడు పెట్రోల్ లేకుండానే ఎలక్ట్రానిక్ వాహనంపై దూసుకుపోతున్నాడు. ఒకప్పుడు బ్లాక్ అండ్ వైట్ టీవీ ఉంటేనే ఎంతో గర్వంగా భావించేవారం. ఇప్పుడు అభివృద్ధి కలర్ టీవీని ఇంటి గోడలదాకా తీసుకువచ్చింది. అభివృద్ధి మరో అడుగు ముందుకేసింది. ఇప్పుడు ప్రతి ఒక్కరి చేతిలో స్మార్ట్‌ఫోన్ తప్పనిసరిగా మారింది. ఒకవేళ ఒక్కపూట తినడానికి తిండి లేకపోయినా ఫరవాలేదు గాని ఫోన్ లేకుండా రోజు గడవదు. టీవీలలో ప్రసారమయ్యే అనైతిక సంబంధాల కథలను ఇంటి పెద్దలు తీవ్రంగా నిరసించేవారు. సీరియళ్లలో, సినిమాల్లో కొన్ని అసభ్యకర సన్నివేశాలు వచ్చినప్పుడు టీవీని ఆపేసేవారు. కానీ ఇప్పుడు టీవీ తానే మూసుకుపోయింది. ఇంటి గోడలపై వేలాడుతున్న టీవీలపై ధూళి పేరుకుపోయింది.

ఇప్పుడు స్మార్ట్ ఫోన్ ప్రతి ఒక్కరి చేతిలో ఉంటుంది- పిల్లల దగ్గర నుంచీ పెద్దల వరకూ ప్రతి ఒక్కరూ తమకు ఇష్టమైన కార్యక్రమాలను తమ తమ మొబైల్ ఫోన్లలో చూసుకుంటున్నారు. యువత ఏం చూస్తున్నారు? పిల్లలు ఏం చూస్తున్నారు. యువతులు ఏం చూస్తున్నారు? ఈ ప్రశ్నలకు సమాధానం లేదు. స్మార్ట్ ఫోన్ మితిమీరిన స్వేచ్ఛను ఇచ్చింది- అది రహస్యంగా అయినా, బహిరంగంగా అయినా.

ఈ స్వేచ్ఛ, వాట్సాప్ మెసేజ్‌లు, సోషల్ మీడియా, చాటింగ్ యాప్‌లు ప్రపంచాన్ని ఒక చిన్న కుగ్రామంలా మార్చేశాయి. ఇన్ స్టా గ్రామ్ ప్రేమలు దేశాల హద్దులు దాటించాయి. “ఫలానా ఫారిన్ యువకుడు ఇండియాకు వచ్చి, మన ఊరి అమ్మాయిని భారత సంప్రదాయ పద్ధతిలో పెళ్లి చేసుకున్నాడు” అనే వార్తలు, ఫొటోలతో సహా వార్తాపత్రికల్లో రావడం కొత్త ఏమీ కాదు.

కానీ ఇప్పుడు...

గత ఐదేళ్లలో ఐదు రాష్ట్రాల్లో 785 మంది భర్తలను భార్యలు హత్య చేశారు- ఇది నేషనల్ క్రైమ్ రికార్డ్ బ్యూరో (NCRB) నివేదిక. ఇప్పటి వరకూ స్త్రీలపై జరిగే అఘాయిత్యాల కథలు వినేవాళ్లం. కానీ ఇప్పుడు ఆ నేరాల జాబితాలో యువతులు, గృహిణులు కూడా చేరిపోయారు.

ఒక ఉదాహరణ: కొన్ని రోజుల క్రితం సికింద్రాబాద్‌లో 10వ తరగతి విద్యార్థిని తన ప్రేమికుడి సహాయంతో తన తల్లిని హత్య చేయించింది. రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో కూడా ఇటువంటి ఘటనలు చోటుచేసుకున్నాయి- భార్యలు తమ ప్రేమికుల

సహాయంతో లేదా రెంటుకు గూండాలను పెట్టించి భర్తలను హత్య చేయించడం లాంటి వార్తలు మన కుటుంబ వ్యవస్థను విచ్ఛిన్నం చేస్తున్నాయి. ఈ వార్తలు దినపత్రికల్లో ప్రముఖంగా వస్తున్నాయి. సమాజం ఒక కొత్త భయంకర దిశలో సాగిపోతోంది.

"రాత్రి కోసం ఎదురుచూడాల్సిన అవసరం లేదు- ఈ రోజుల్లో పట్టపగలే అన్నీ జరుగుతున్నాయి."

ఈ 785 హత్యలలో అత్యధికంగా ఉత్తర ప్రదేశ్, మధ్యప్రదేశ్, బిహార్, రాజస్థాన్, మహారాష్ట్రలలో జరిగాయి. నేరాలకు కారణాలు- వ్యాపార లావాదేవీలలో మోసం, అక్రమ సంబంధాలు, ప్రతిష్ఠ సంబంధిత సమస్యలు.

ఈ నివేదికలో పురుషులు కూడా గృహహింసకు బలవుతున్నారనే అంశాన్ని కూడా ఎన్‌సీఆర్‌బీ ప్రస్తావించింది. అభివృద్ధితో పాటు నేరాలు కూడా పెరుగుతున్నాయి. ఇంటర్నెట్ విప్లవంతో నేరాలు విస్తృతమయ్యాయి.

సోషల్ మీడియా ద్వారా ఏర్పడే పరిచయాలు ప్రేమగా మారి, ఆ తరువాత సహజీవనం, ఆపై వివాదాలు ముదిరి హత్యలకు దారితీస్తున్నాయి. ఈ విషయంలో పురుషులూ, మహిళలూ ఇద్దరూ బాధితులే.

ఒకప్పుడు సినిమా కథల్లో చూసే సంఘటనలు ఇప్పుడు నిజ జీవితంలో జరుగుతున్నాయి. ఉదాహరణకు: ఒక 55 ఏళ్ల వ్యక్తి కొన్ని సంవత్సరాల క్రితం ఓ మహిళను పెళ్లి చేసుకున్నాడు. అతను తాగి వచ్చి ప్రతి రోజు భార్యను కొట్టేవాడు. అతని అత్యాచారాల కారణంగా భార్య చివరకు ఓ రోజు రాత్రి రాళ్లతో అతన్ని కొట్టి హత్య చేసింది. ఆ తరువాత ఆమె స్వయంగా పోలీసులకు లొంగిపోయింది.

ఇలాంటి ఘటనను చూసి మనం బాధపడాలో, సానుభూతి చూపించాలో అర్థం కావడం లేదు.

గతంలో కొంతమంది పురుషులు భార్యలను కించపరిచేలా ప్రవర్తించేవారు. శారీరకంగా, మానసికంగా చిత్రహింసలకు గురిచేసేవారు. రాత్రి మద్యం సేవించి భార్యలను దారుణంగా హింసించేవారు. అనేక హత్యలు, నేరాల్లో పురుషులే భాగస్వాములయ్యేవారు. అయితే ఇప్పుడు పరిస్థితులు మారాయి. సున్నిత మనస్కులైన స్త్రీలు సైతం హంతకులుగా మారిపోతున్నారు. పతీ, పత్నీ ఔర్ వో లాంటి సీరియళ్లు, సినిమాలు చాలా అందంగా చూపిస్తున్నారు. ఈ సీరియళ్లు, సోషల్ మీడియా ప్రభావం సమాజాన్ని అనాగరికంగా మార్చేస్తున్నాయి.

## ముస్లింలే బీజేపీ టార్గెట్

కేంద్రంలోని బీజేపీ నేతృత్వంలో గల ఎన్డీఏ సర్కారు అవలంబిస్తున్న విద్వేషపూరిత రాజకీయాలపై పలు అంతర్జాతీయ మానవ హక్కుల సంస్థల నుంచి తీవ్ర వ్యతిరేకత వస్తున్నది. అమెరికాలోని న్యూయార్క్ కేంద్రంగా పని చేసే ప్రభుత్వేతర సంస్థ హ్యూమన్ రైట్స్ వాచ్ (హెచ్ఆర్‌డబ్ల్యూ) కూడా బీజేపీ ప్రభుత్వం తీరుపై ఆందోళనను వ్యక్తం చేసింది. తన రాజకీయ ప్రయోజనాల కోసం కాషాయ సర్కారు ముస్లింలను టార్గెట్ చేసుకుంటున్నదనీ, అక్రమ వలసదారుల పేరుతో వందలాది మంది బెంగాలీ ముస్లింలను బంగ్లాదేశ్‌కు బలవంతంగా పంపుతోందని ఆరోపించింది. భారత పౌరులతో పాటు బెంగాలీ ముస్లింలను దేశం నుంచి ఏకపక్షంగా బహిష్కరించటం ద్వారా వివక్షను పెంచుతోందని హెచ్ఆర్‌డబ్ల్యూ ఆసియా డైరెక్టర్ ఎలైన్ పియర్సన్ అన్నారు. హెచ్ఆర్‌డబ్ల్యూ.. ప్రధానంగా మానవ హక్కులపై పని చేస్తుంది. దీనిపై పరిశోధనలూ జరుపుతుంది. భారత్‌లో నెలకొన్న పరిస్థితులపై హెచ్ఆర్‌డబ్ల్యూ ఆందోళనను వెలిబుచ్చింది. భారత అధికారులు ప్రజలను చట్టవిరుద్ధంగా బహిష్కరించటాన్ని ఆపాలని డిమాండ్ చేసింది. బహిష్కరణకు గురైనవారిలో చాలా మంది బంగ్లాదేశ్ సరిహద్దు రాష్ట్రాల నుంచి వచ్చిన భారతీయ పౌరులు అని హెచ్ఆర్‌డబ్ల్యూ తెలిపింది. మే 7 నుంచి జూన్ 15 మధ్య కనీసం 1500 మంది ముస్లిం పురుషులు, మహిళలు, పిల్లలను బంగ్లాదేశ్‌కు పంపించారనీ, వీరిలో మయన్మార్ నుంచి వంద మంది రోహింగ్యా శరణార్థులూ ఉన్నారని బోర్డర్ గార్డ్ బంగ్లాదేశ్ రిపోర్ట్‌ను ఉటంకిస్తూ హెచ్ఆర్‌డబ్ల్యూ వివరించింది. ఈ విషయంలో మాత్రం భారత్ నుంచి ఎలాంటి అధికారిక గణాంకాలూ లేకపోవటం గమనార్హం.

బహిష్కరణకు గురైనవారిలో ఎక్కువ మంది బీజేపీ పాలిత రాష్ట్రాలైన అసోం, యూపీ, మహారాష్ట్ర, గుజరాత్, ఒడిశా, రాజస్తాన్‌ల నుంచి వచ్చిన వలస కార్మికులని హెచ్ఆర్‌డబ్ల్యూ తెలిపింది. బహిష్కరించే క్రమంలో సరిహద్దుల వద్ద ఉండే గార్డులు అమానుషంగా ప్రవర్తించారనీ, వారిని (బహిష్కరణకు గురైన వారిని) కొట్టారని ఆరోపించింది. ఈ క్రమంలో వారి పౌరసత్వం గురించి ధ్రువీకరించే చర్యలు చేపట్టకుండానే.. బంగ్లాదేశ్‌కు వెళ్లాలంటూ బలవంతం చేశారని హెచ్ఆర్‌డబ్ల్యూ వివరించింది. తనతో పాటు మరో 14 మందిని బంగ్లాదేశ్‌కు బలవంతంగా ఎలా తరలించారన్న విషయంపై అసోంకు చెందిన ఖైరుల్ ఇస్లాం (51) చెప్పిన విషయాన్ని సదరు మానవ హక్కుల సంస్థ ఉటంకించింది.




## మానసిక సమస్యలతో విద్యార్థుల ఆత్మహత్యలు!

విద్యార్థుల ఆత్మహత్యలపై సుప్రీంకోర్టు తీవ్ర వ్యాఖ్యలు చేసింది. భావిపౌరుల మరణాలు వ్యవస్థాపక వైఫల్యాలుగా జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతాల ధర్మాసనం అభివర్ణించింది. ఆత్మహత్యల నిరోధానికి పలు మార్గదర్శకాలను జారీ చేసింది. ఎన్‌సీఆర్‌బీ 2022లో ప్రచురించిన 'యాక్సిడెంటల్ డెత్స్ అండ్ సూసైడ్స్ ఇన్ ఇండియా' నివేదికను ఉటంకిస్తూ.. చాలా దారుణమైన పరిస్థితులను గమని స్తున్నామని వ్యాఖ్యానించింది. "మానసిక ఒత్తిడి, విద్యాభారం, సామాజిక వివక్ష, విద్యాసంస్థల తీరు వంటి కారణాలతో విద్యార్థులు బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. ఇది వ్యవస్థాపక వైఫల్యాన్ని సూచిస్తోంది" అని ధర్మాసనం ఆవేదన వ్యక్తం చేసింది. విశాఖపట్నంలో నీట్ అభ్యర్థి అయిన ఓ 17 ఏళ్ల యువతి ఆత్మహత్య కేసును సీబీఐకి బదలాయించాలన్న అభ్యర్థనను ఆంధ్రప్రదేశ్ హైకోర్టు తోసిపుచ్చింది. దీనిపై దాఖలైన అప్పీల్‌ను సుప్రీంకోర్టు ఇటీవల విచారించిన సందర్భంగా ఈ వ్యాఖ్యలు చేసింది. విద్యార్థుల్లో మానసిక ఆరోగ్య సమస్యలు తీవ్రమవు తున్నాయని.. కోటా, జైపూర్, సీకార్, విశాఖపట్నం, హైదరాబాద్, ఢిల్లీ లాంటి నగరాల్లో ఇవి మరీ తీవ్రస్థాయిలో ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేసింది. ఆత్మహత్యల నివారణకు పలు సూచనలు చేసింది. ఆయా అంశాలను 90 రోజుల్లో అమలు చేసేలా అఫిడవిట్ సమర్పించాలని ఆదేశాలు జారీ చేసింది.

## 63 జిల్లాల్లో 50% పైగా చిన్నారుల్లో ఎదుగుదల లోపం

దేశంలోని చిన్నారుల్లో పోషకాహార లోపం ఆందోళనకరంగా ఉంది. 13 రాష్ట్రాలు, యూటీల్లోని 63 జిల్లాల్లో అంగన్‌వాడీ కేంద్రాల్లో నమోదైన చిన్నారుల్లో 50 శాతానికి పైగా ఎదుగుదల లోపంతో బాధపడుతున్నారని పార్లమెంట్‌లో సమర్పించిన పలు పత్రాల డేటా వెల్లడించింది. 199 జిల్లాల్లో ఇది 30 నుంచి 40 శాతం మధ్య ఉందని పేర్కొంది. పిల్లలు చాలా కాలం పాటు తగిన పోషకాహారం తీసుకోనప్పుడు సంభవించే దీర్ఘకాలిక పోషకాహార లోపాన్నే ఎదుగుదల లోపం (స్టంటింగ్) అంటారు. కేంద్ర మహిళా, శిశు అభివృద్ధి శాఖకు చెందిన పోషన్ ట్రాకర్-2025 జూన్ ఆధారిత డేటా ప్రకారం.. కొన్ని జిల్లాల్లో అత్యధిక సంఖ్యలో చిన్నారుల్లో ఎదుగుదల లోపం ఉంది.

## పాఠ్యాంశంగా ఆపరేషన్ సింధూర్!

ఆపరేషన్ సిందూర్, శుభాన్షు శుక్లా పాల్గొన్న అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్) మిషన్ యాత్ర, చంద్రయాన్, ఆదిత్య ఎల్1తో సహా భారతీయ అంతరిక్ష యాత్రలు వంటి అంశాలు త్వరలో జాతీయ విద్యా పరిశోధన, శిక్షణ మండలి (ఎన్‌సీఈఆర్‌టీ) సిలబస్‌లో భాగం కానున్నట్లు కేంద్రం వెల్లడించింది. రెండు మాడ్యూల్స్ ప్రస్తుతం రూపకల్పన దశలో ఉన్నాయి. మొదటి మాడ్యూల్ 3వ తరగతి నుంచి 8వ తరగతి విద్యార్థుల కోసం కాగా రెండో మాడ్యూల్ 9 నుంచి 12వ తరగతి విద్యార్థుల కోసం. ఒక్కో మాడ్యూల్ సుమారు 8 నుంచి 10 పేజీలు ఉంటుంది. ఇందులో భారతదేశ సైనిక ప్రస్థానంలో ప్రధాన మైలురాళ్ల గురించి ముఖ్యంగా పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా చేపట్టిన ఆపరేషన్ సింధూర్ గురించి ఉంటుంది.

## మహిళలపై పెరిగిన అత్యాచారాలు గంటకు 51 ఎఫ్ఐఆర్‌లు : ఎన్‌హెచ్ఆర్‌సీ షాకింగ్ ప్రకటన



దేశంలో మహిళలకు భద్రత కరువైందని నొక్కిచెబుతూ ఎన్‌హెచ్ఆర్‌సీ (జాతీయ మానవ హక్కుల సంఘం) చైర్‌పర్సన్ జస్టిస్ వి.రామ సుబ్రమణియన్ కీలక వ్యాఖ్యలు చేశారు. భారత్ లో ప్రతి గంటకు మహిళలు హింసకు గురవుతున్నట్టు దాదాపు 51 ఎఫ్ఐఆర్లు నమోదవుతున్నాయని తెలిపారు. పని చేసే ప్రదేశాల్లో, సమాజంలో మహిళల భద్రత అనే అంశంపై చర్చ జరిగిన సమయంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. భారత్‌లో దేవతలను పూజించడం, మహిళలను హింసించడం భయంకరమైన వాస్తవం అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జస్టిస్ రామసుబ్రమణియన్ మాట్లాడుతూ.. పనిచేసే ప్రదేశాల్లో లైంగిక వేధింపులు నిరోధించడానికి తీసుకువచ్చిన చట్టం 2023 అమలు వెనుక జరిగిన సుదీర్ఘ పోరాటాన్ని గుర్తు చేసుకున్నారు.




## పాలస్తీనాను ప్రత్యేక దేశంగా గుర్తిస్తాము.. ఫ్రాన్స్ అధ్యక్షుడి ప్రకటన

ఫ్రాన్స్ అధ్యక్షుడు ఎమాన్యుయెల్ మాక్రాన్ తాజాగా కీలక ప్రకటన చేశారు. పాలస్తీనాను ప్రత్యేక దేశంగా గుర్తిస్తామని పేర్కొన్నారు. ఈ మేరకు సెప్టెంబర్‌లో ఐక్యరాజ్యసమితిలో పాలస్తీనా అధికారిక గుర్తింపునకు సిద్ధం అవుతున్నట్టు కూడా తెలిపారు. ఇస్రాయీల్‌తో యుద్ధం తరువాత గాజాలో మానవ సంక్షోభంపై ప్రపంచ వ్యాప్తంగా ఆందోళన వ్యక్తమవుతోంది. ఇస్రాయీల్ దాడుల్లో చిక్కుకుపోయిన వేలాది మంది సామాన్యులు ఆకలితో అలమటిస్తున్న వైనంపై తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో ఫ్రాన్స్ అధ్యక్షుడి ప్రకటన కీలకంగా మారింది. గాజాలో యుద్ధం ఆపడం అత్యవసరమని ఫ్రాన్స్ అధ్యక్షుడు స్పష్టం చేశారు. సామాన్య పౌరులను కాపాడాల్సిన అవసరం ఉందని అన్నారు. గాజాలో శాంతిని నెలకొల్పడం సాధ్యమేనని అన్నారు. మధ్యప్రాచ్యంలో శాశ్వతంగా శాంతి నెలకొల్పేందుకు ఇది అవసరమని అన్నారు. గతంలో ఇచ్చిన మాటకు కట్టుబడి, ఫ్రాన్స్ ప్రజల మనోభీష్టాన్ని అనుసరించి ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు. తక్షణ కాల్పుల విరమణ, బందీల విడుదల, మానవతా సాయం పెంపు వంటి చర్యలు చేపట్టాలని ఆయన పేర్కొన్నారు. శాంతిని నెలకొల్పేందుకు మరో ప్రత్యామ్నాయం లేదని అన్నారు. ఫ్రాన్స్, ఇజ్రాయెల్, పాలస్తీనా వాసులు, ఐరోపా దేశాలు, ఇతర అంతర్జాతీయ భాగస్వాములు అంతా కలిసి శాంతి నెలకొల్పడం సాధ్యమేనని నిరూపించాల్సి ఉందని అభిప్రాయ పడ్డారు.

## టీకాలకు దూరంగా 14 లక్షల మంది చిన్నారులు : లాన్సెట్ నివేదిక

దేశంలో చిన్నారులకు వ్యాక్సినేషన్ విషయంలో ఎంతో పురోగతి సాధిస్తున్నామని చెప్పుకుంటున్నా.. ఇంకా 14 లక్షల మందికి పైగా చిన్నారులకు ఎలాంటి టీకాలు అందలేదు. ది లాన్సెట్ జనరల్‌లో ప్రచురించిన నివేదిక ఈ విషయాన్ని వెల్లడించింది. వ్యాక్సిన్‌ల అంతరం భారత్‌లో ఆందోళనకర పరిస్థితికి దారితీయనుందని నివేదిక తెలిపింది. 'గ్లోబల్ బర్డెన్ ఆఫ్ డిసీజ్ స్టడీ వ్యాక్సిన్ కవరేజ్ కొలాబరేటర్స్' అనే విశ్లేషణ అధారంగా లాన్సెట్ ఈ నివేదికను ప్రచురించింది. ఈ విశ్లేషణ ఆధారంగా భారత్‌లో 2023లో 1.44 మిలియన్ల (14,50,000మంది) చిన్నారులకు వ్యాక్సిన్లు వేయలేదని నివేదిక తేల్చింది. వీరిని జీరో డోస్‌లో చేర్చినట్లు తెలిపింది. ప్రపంచవ్యాప్తంగా రోగనిరోధకత యత్నాల్లో తీవ్రమైన స్తబ్దత నెలకొందని, ముఖ్యంగా భారత్, ఇతర దక్షిణాసియా దేశాలలో టీకాలకు దూరంగా ఉన్న లక్షలాది మంది చిన్నారులు ప్రాణాంతకమైన వ్యాధుల బారిన పడే అవకాశం ఉందని హెచ్చరించింది. 1980 -2023 మధ్య వ్యాక్సిన్‌లను పరిమితిని విస్తరించడంలో గణనీయమైన పురోగతి ఉన్నప్పటికీ., 2010 నుండి ఈ వేగం గణనీయంగా తగ్గిందని అధ్యయనం కనుగొంది. 2023 నాటికి, ప్రపంచ వ్యాప్తంగా కోటి 50 లక్షలకు పైగా (15.7మిలియన్ల మంది) చిన్నారులు తమ జీవితంలో మొదటి సంవత్సరంలో (డిఫ్తీరియా, టెటనస్, పెర్టుసిస్) డిటిపి వ్యాక్సిన్ మోతాదులను తీసుకోలేదని అంచనా వేసింది. దీనిలో భారత్ వాటా గణనీయంగా ఉంది. 2010- 2019 మధ్య 204 దేశాలలో 100 దేశాలలో మీజిల్స్ (తట్టు) వ్యాక్సిన్ కవరేజీ తగ్గింది. అయితే 36 అధిక ఆదాయ దేశాల్లో 21 దేశాలు డిటిపి, మీజిల్స్, పోలియో, క్షయ వ్యాధులకు కనీసం ఒక్క వ్యాక్సిన్ డోస్‌ల కవరేజ్‌లో క్షీణతను ఎదుర్కొన్నాయి. కోటి 50 లక్షల టీకాలు వేయని పిల్లల్లో సగానికి పైగా చిన్నారులు కేవలం ఎనిమిది దేశాల్లో నివసిస్తున్నారు. నైజీరియా తర్వాత 14 లక్షల జీరో డోస్ పిల్లలతో భారత్ రెండో స్థానంలో ఉంది. జీరో డోస్ చిన్నారుల్లో దక్షిణాసియా ప్రాంతం 13శాతం మందిని కలిగి ఉంది. ఇది దక్షిణాసియాలో సంక్షోభం తీవ్రతను నివేదిక హైలెట్ చేస్తోంది. అలాగే, అధిక ఆదాయం ఉన్న దేశాల్లోనూ వివిధ వ్యాధుల టీకాల్లో ఒక మోతాదుకు చిన్నారులు దూరంగా ఉంటున్నారు. భారత్ వంటి వైవిధ్యభరితమైన దేశంలో సున్నితమైన టీకా కార్యక్రమాలు అవసరమని నివేదిక తెలిపింది. వ్యాక్సినేషన్లలో పెరుగుతున్న అంతరం 2030 నాటికి ప్రపంచ రోగనిరోధక లక్ష్యాలను చేరుకోలేమనే స్పష్టమైన హెచ్చరికగా ఈ నివేదికను తీసుకోవాలని ఆరోగ్య రంగ నిపుణులు అంటున్నారు.

## అమెరికాలో భారీగా పడిపోయిన జననాల రేటు

అమెరికాలో సంతానోత్పత్తి దారుణంగా పడిపోతోంది. గతంలో ఎప్పుడూ లేనంత తక్కువగా గత ఏడాది జననాల రేటు నమోదైంది. 2024కు సంబంధించి వ్యాధి నియంత్రణ, నివారణ సెంటర్లు (సీడీసీ) తాజాగా విడుదల చేసిన గణాంకాల్లో సంతానోత్పత్తి తగ్గిపోయిన విషయం స్పష్టమైంది. జనాభా భర్తీ రేటు ప్రకారం సగటున ప్రతి మహిళకు 2.1 కంటే ఎక్కువగా పిల్లలు ఉండాల్సిన తరుణంలో.. అమెరికాలో జననాల రేటు 1.6 కంటే తక్కువగా నమోదైందని సీడీసీ వెల్లడించింది. 1960ల్లో యూఎస్‌లో జననాల రేటు సుమారు 3.5గా ఉంది. ఆ తర్వాత నుంచి క్రమంగా క్షీణిస్తూ వస్తోంది. జననాల రేటు తగ్గిపోతోందన్న హెచ్చరికల నేపథ్యంలో ట్రంప్ ప్రభుత్వం సంతానోత్పత్తిని పెంచడానికి ఇటీవల చర్యలు చేపట్టింది.

# పశ్చాత్తాపం చెందిన యువకుడు

- ముహమ్మద్ వహీదుద్దీన్

**పూర్వకాలం మాట.** పట్టణానికి చాలా దూరంలో ఒక గ్రామం ఉండేది. ఆ గ్రామంలో ఒక యువకుడు ఉండేవాడు. ఐదు పూటల నమాజు చేస్తూ.. దివ్య ఖుర్‌ఆన్‌ను ప్రతి రోజు పఠించేవాడు. ఉన్న దానిలో పేదవారికి దానం చేసేవాడు.

పట్టణానికి వెళ్లి ప్రతి రోజు పండ్లు, ఫలాలు అమ్మేవాడు. ఒకరోజు అతని వద్దకు అతని గురువు వచ్చాడు. అతని దగ్గర పండ్లు, ఫలాలు తీసుకొని డబ్బులు ఇచ్చాడు. కానీ అతడు తీసుకోలేదు.

గురువుగారు ఎంత చెప్పినా డబ్బులు తీసుకోవడానికి నిరాకరించాడు. గురువుగారు! నా కోసం మీరు దుఆ చేయండి. నా వ్యాపారం బాగా అభివృద్ధి చెందాలని అల్లాహ్‌ను ప్రార్థించండి.. అని అభ్యర్థించాడు.

గురువుగారు సరే అంటూ.. ముందుకు సాగిపోయారు.

కొన్ని నెలలలోనే అతడి వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా అభివృద్ధి చెందింది. అతను ఆ వ్యాపారంలోనే విలీనం అయిపోయాడు.

ఎప్పుడో ఒకసారి నమాజు చేసేవాడు.

మెల్ల మెల్లగా దివ్య ఖుర్‌ఆన్ చదవడం మానేశాడు.

ఎవరైనా బీదవారు దానం అడిగితే వారిని కోపగించేవాడు. వారిని కసిరికొట్టేవాడు. బంధువులను, మిత్రులను కూడా మరిచిపోయాడు.

పగలు, రాత్రి ఒకటే ఆలోచన. వ్యాపారం ఇంకా అభివృద్ధి చెందాలనీ. డబ్బులు సంపాదించడం తప్ప వేరే ఆలోచన లేదు.

చివరికి సృష్టికర్త అయిన అల్లాహ్‌ను కూడా మరిచిపోయాడు.

కొన్ని సంవత్సరాల తర్వాత అదే పండ్ల దుకాణానికి వచ్చారు గురువుగారు. అక్కడ చూసే సరికి పెద్ద దుకాణం ఉన్నది. ఎవరిదో అనుకున్నారు. ఎందుకో ఒకసారి లోపలికి వెళ్లి ఏదైనా పండ్లు తీసుకొని వెళ్దామని అనుకున్నారు గురువుగారు. లోపలికి వెళ్లేసరికి అతడు ఉన్నాడు. కానీ ఈసారి అతనిలో చాలా మార్పు కనబడింది.

అతను కుర్చీ మీద నుంచి లేవలేదు. గురువు గారికి సలాం చేయలేదు.

గుర్తు పట్టనట్టుగా నటించాడు.

గురువు గారే స్వయంగా దగ్గరికి వెళ్లి, ఏం నాయనా బాగున్నావా! అని అడిగారు. నేను బాగానే ఉన్నాను, మీకు ఏం కావాలో చెప్పండి, ఇస్తాను, తీసుకొని వెళ్ళిపొండి అని కసురుకుంటూ చెప్పాడు.

ఒక్కసారిగా గురువుగారు ఆశ్చర్యానికి లోనయ్యారు. కొన్ని పండ్లు, ఫలాలు తీసుకొని డబ్బులు ఇచ్చారు. అక్కడి నుంచి వెళ్ళిపోతూ..

నాయనా! నీ వ్యాపారంలో బర్కత్(శుభం) రావాలని, నీ ఆరోగ్యం బాగా ఉండాలని అనగానే, ఆ యువకుడు కుర్చీ మీద నుంచి లేచి, మీ దుఆ (వేడుకోలు) ఏం అవసరం లేదు. ఇది నా కష్టం ద్వారా సంపాదించినది. మీరు ఇక్కడి నుంచి వెళ్ళిపొండి అంటూ దుకాణం నుంచి బయటికి పంపివేశాడు. గురువుగారు కింద ముఖం వేసుకొని ఇంటికి వెళ్ళిపోయారు.

కొన్ని రోజులలోనే అతని వ్యాపారం మొత్తం కుప్పకూలిపోయింది. నష్టాల్లో కూరుకు పోయాడు. ఆరోగ్యం క్షీణించి పోయింది. భార్య కూడా అతన్ని విడిచి, పుట్టింటికి వెళ్లిపోయింది.

ఒకరోజు గురువుగారు అదే మార్గంలో వెళుతుండగా, ఒక చెట్టు కింద చిన్న బండిలో పండ్లు అమ్ముకుంటూ నిలబడి ఉన్నాడు ఆ యువకుడు. గురువుగారు దగ్గరికి వెళ్లి, ఏం నాయనా బాగున్నావా! అని అడిగితే, ఏడ్చుకుంటూ తన జీవితంలో జరిగిన విషయాలు మొత్తం చెప్పాడు.

నాయనా! మనం ఎప్పుడైనా కష్టంలో ఉన్నా, సుఖములో ఉన్నా అల్లాహ్‌ను గుర్తు చేస్తూ ఉండాలి, నమాజును స్థాపించాలి, పేదవారికి దానధర్మాలు చేస్తూ ఉండాలి, ప్రతిరోజు దివ్య ఖుర్‌ఆన్ చదువుతూ ఉండాలి, ఇరుగుపొరుగు వారిని, బంధువులను, మిత్రులను మరచిపోకూడదు అని ఉపదేశించారు గురువు గారు.

యువకునికి అన్ని విషయాలు అర్థమైపోయాయి. పశ్చాత్తాపం చెందాడు. ఓ అల్లాహ్! నన్ను క్షమించమని వేడుకున్నాడు.

గురువుగారు ఆ యువకుడిని దీవిస్తూ.. నీ వ్యాపారం వృద్ధి చెందాలని, నిజాయితీగా సంపాదించాలని, నమాజ్‌ను స్థాపించాలని, దివ్య ఖుర్‌ఆన్‌ను పఠించాలని, పేదవారికి దానధర్మాలను చేస్తూ ఉండాలని, ఇరుగుపొరుగు, బంధువులు, మిత్రుల హక్కులను కూడా గుర్తించాలని చెప్పారు.

అల్లాహ్ భయంతో అంతిమ దైవప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం చెప్పిన విధంగా వ్యాపారం చేస్తే అందులో శుభం ఉంటుందని చెబుతూ, కొన్ని డబ్బులు జేబులో నుంచి తీసి ఆ యువకుని జేబులో పెట్టారు. నాయనా! ఈ డబ్బుతో మళ్లీ అల్లాహ్ నామంతో మంచి వ్యాపారము మొదలుపెట్టు అని చెబుతూ వెళ్లిపోయారు.

మధ్యాహ్నం జుహ్ర్ నమాజ్ కోసం మస్జిద్ నుండి అజాన్ పిలుపు వినబడుతోంది.

వెంటనే యువకుడు మస్జిద్ వైపు అడుగులు వేసుకుంటూ వెళ్లిపోయాడు.

Edited, Printed & Published by S.M. Mallick on behalf of Telugu Islamic Publications, Typeset at "Geeturai Graphics", Printed at Cosmic Printers, Lakkadkot, Hyderabad-2, RNI R.No.37796/81, Postal Regn. No.HSE/422/2023-2025 Phone: 24564583. **e-mail : geeturaiweekly@gmail.com**